

ప్రతి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
గుంటూరు పల్నాడు
శనివారం 07 ఫిబ్రవరి 2026 - పేజీలు 10

# ఆకతాయిలకు అడ్డా
## చౌడవరం గృహకల్ప


- బ్లాక్ - 1లో చోరీలు - గంజాయి బ్యాచ్ ఆగడాలు..!
- నివాసానికి భయపడుతున్న యజమానులు

03 పేజీలో

గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్: పేదల నివాసాల కోసం ఏర్పాటుచేసిన చౌడవరం రాజీవ్ గృహకల్ప సముదాయం ఆకతాయిలకు, గంజాయి బ్యాచ్ కి అడ్డాగా మారింది. ఒకే ఒక్క బ్లాక్ -1 వారికి షెల్టర్ జోన్ గా ఏర్పడింది. బ్లాక్ వన్ లో ఎవరు నివసించడానికి సాహసం చేయటం లేదు. భవిష్యత్తులో అక్కడకు ఎవరూ రాకుండా దొంగలు అందిన కాడికి నిత్యం దోచుకుంటున్నారు. ముఖ్యంగా తలుపులకు రక్షణగా ఏర్పాటుచేసిన ఇనుప గ్రిల్స్ ను సైతం వారు వదలడం లేదు అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.


మాజీ మంత్రి అంబటి

## కుటుంబ సభ్యులను పరామర్శించిన
# వైసిపి నేతలు ఆర్ కె రోజా, ఏసురత్నం

**గుంటూరు మేజర్ న్యూస్ :** గుంటూరు నగరంలో సిద్ధార్ధ నగర నందు ఉన్న గుంటూరు జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షులు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త మాజీ మంత్రివర్యులు అంబటి రాంబాబు ఇంటి మీద దాడి జరిగిన సంఘటన తరువాత అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు విచ్చేసిన మన మాజీ మంత్రి ఆర్కే రోజా శుక్రవారం గుంటూరు కు వచ్చారు. దాడి రోజు జరిగిన సంఘటనను ఆర్ కె రోజాకు ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం వివరించారు. గుంటూరు వైసిపి నగర్ అధ్యక్షులు నూరు ఫాతిమా, వివిధ నియోజకవర్గాలవైసీపీ సమన్వయకర్తలు,నగరంలో ఉన్న వార్డు కార్పొరేటర్స్ వైసీపీ ముఖ్య నాయకులు వార్డు ప్రెసిడెంట్ తదితరులు ఆర్ కె రోజా తో కలిసి వెళ్లి మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు.



## క్వాంటమ్ వ్యాలీ భూమి పూజకు
# పటిష్ట బందోబస్తు

03లో

## శిక్షణ కార్యక్రమాల
# షెడ్యూల్ ముందుగా విడుదల చేయాలి

**జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా**



**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** ర్యాంప్ (రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎం.ఎస్.ఎం.ఇ ప్రోగ్రామ్) శిక్షణ కార్యక్రమాల షెడ్యూల్ ను ముందుగా విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి (డి.ఐ.ఇ.పి.సి) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. మిగతా 3లో

## కొండ పండుగకు
# సర్వం సిద్ధం..!



- రెండురోజులపాటు కొనసాగనున్న కొండవీడు ఉత్సవాలు...
- ఉత్సవాలకు భారీ పోలీస్ బందోబస్త్...

**యడ్లపాడు, మేజర్ న్యూస్:** దక్షిణ భారతదేశంలోని అతి కీలకమైన చారిత్రక ప్రదేశం కొండవీడు. శత్రు దుర్భేధ్యంగా తమ రక్షణ కోసం నాటి రాజులు నిర్మించిన అతి కీలకమైన వ్యూహాత్మక కోటలలో

03లో

## తల్లిదండ్రుల
# ఆశలు నెరవేరుస్తున్నాం

- జాబ్ మేళాకు విశేష స్పందన
- 382 మందికి నియామక పత్రాలు
- శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ

3లో



# ఆకతాయిలకు అడ్డా... చౌడవరం గృహకల్ప

మొదటి పేజీ తరువాయి

ఎవరూ రాకుండా ఏకంగా గదుల తాళాలను వారు పగులగొట్టారు. గదుల్లో ఉన్న విలువైన ఫ్యాన్లు, మంచాలు, కంచాలు వేటిని వదల్లేదు. భవిష్యత్తులో గదులు వినియోగానికి వీలు లేకుండా కరెంట్ స్విచ్ బోర్డులను ధ్వంసం చేశారు. బోర్డు ల్లో అమర్చిన విద్యుత్ వైర్లను సైతం అపహరించుకుపోయారు. కరెంటు మీటర్ల నుంచి బయటకు వచ్చిన వైర్లను సైతం వీరు వదల్లేదు అంటే వారు గంజాయి బ్యాచ్ గా స్థానికులు అనుమానిస్తున్నారు. ఎవరైనా స్థానికులు వారిస్తే వారిపై దాడులకు సైతం సిద్ధపడుతున్నట్లు తెలిసింది.



ధ్వంసం చేసిన స్విచ్ బోర్డులు

**ఆటోల్లో వచ్చి... పేకాట ఆడుతూ...**

కొందరు పగలు... రాత్రి... తేడా లేకుండా ఈ ఒకటో నెంబర్ వద్దకు ఆటోలో తరలివస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. రాత్రి సమయంలో అయితే ఏకంగా తాగునీటి క్యాన్లను సైతం తీసుకొని వస్తున్నట్లు తెలిసింది. ఇటీవల స్థానికులు అడిగితే మాకు పార్టీ ఉందని.. మీ ఇల్లులు కాదు కదా... మీకు అనవసరం... పని చూసుకోండి అంటూ దురుసుగా సమాధానం చెప్పి బెదిరించారని పక్క బ్లాక్ వాళ్లు ఆందోళన వ్యక్తం చేశారు.

**ఆకతాయి విద్యార్థులకు వరం:**

చౌడవరం రాజీవ్ గృహకల్ప 1 వ నంబర్ బ్లాక్ సమీపంలోని కళాశాలల విద్యార్థులకు రక్షణ వలయంగా, ఒక వరంగా మారింది. బ్లాక్ వెనుక వైపు రక్షణ గోడను ధ్వంసం చేశారు. అటుగా మార్గం చేసుకొని నిత్యం ఈ బ్లాక్ లోకి వస్తున్నారు. వీళ్లంతా అక్కడ గంజాయి, సిగరెట్లు సేవించటానికి వస్తూ ఉంటారనే అనుమానం వ్యక్తం అవుతుంది. అలాగే కాలనీలో నిత్యం ఘర్షణలు జరుగుతున్నాయని, పోలీసులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్లాక్ లోని మొత్తం 32 గదులను వారు ధ్వంసం చేశారని .. పోలీసులు నిఘా ఉంటేనే సమస్య పరిష్కారం అవుతుందని ప్రజలు అభిప్రాయపడ్డారు. మరికొన్ని ఖాళీ బ్లాక్ లలో కూడా ఇదే పరిస్థితి. మూడు, నాలుగు బ్లాకుల్లోని కొందరు యువకులు సాయంతో బయట వ్యక్తులు ఎక్కడకు వచ్చి ఈ ఆగడాలకు పాల్పడుతున్నట్లు స్థానికుల కథనం.

**నిఘా ఏర్పాటు చేస్తాం:**

**భానోదయ, సౌత్ డీఎస్పీ**

రాజీవ్ గృహకల్ప ప్రాంతంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. ఆకతాయిలను గుర్తించి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సౌత్ డిఎస్పి భానోదయ విలేకరులకు తెలిపారు.

## క్వాంటమ్ వ్యాలీ భూమి పూజకు

# పటిష్ట బందోబస్తు

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్:** తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉద్దండరాయుని పాలెం గ్రామ సమీపంలో "క్వాంటమ్ వ్యాలీ" ఏర్పాటుకు కేటాయించిన భూమిలో, క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శనివారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని సురక్షితంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు గుంటూరు జిల్లా పోలీస్ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ రోజు సాయంత్రం భూమి పూజ కార్యక్రమ ప్రాంగణంలో బందోబస్తు విధులకు హాజరైన పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.వి. రమణమూర్తి, అదనపు ఎస్పీ (లా & ఆర్డర్) శ్రీ ఎ.టి.వి. రవికుమార్ లు సమగ్రంగా బ్రీఫింగ్ నిర్వహించారు. ముఖ్యంగా పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు: వీవీఐపీ, వీఐపీల భద్రతకు పటిష్టమైన ఏర్పాట్లు. బందోబస్తు విధుల్లో పూర్తి అప్రమత్తత. ట్రాఫిక్ నియంత్రణ మరియు వాహనాల పార్కింగ్ ప్రదేశాల సమర్థ నిర్వహణ.

**ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ..**

ఏ చిన్న అవాంఛనీయ ఘటనకు కూడా అవకాశం లేకుండా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించడం. కార్యక్రమం పూర్తిగా విజయవంతంగా, శాంతియుతంగా సాగేందుకు ప్రతి పోలీస్ అధికారి మరియు సిబ్బంది తమ విధులను అత్యంత నిబద్ధతతో, బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని అదనపు ఎస్పీ లు ఆదేశించారు.

# తల్లిదండ్రుల ఆశలు నెరవేరుస్తున్నాం

మొదటి పేజీ తరువాయి

**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి చదివిస్తున్నారని, అయితే ఉద్యోగ అవకాశాలు లభించక ఇబ్బందులు పడుతుండటం ఎన్నికల ప్రచారంలో గమనించానన్నారు. తల్లిదండ్రుల ఆశలను, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు ఈ 18 నెలల్లో మూడోసారి జాబ్ మేళాను నిర్వహించి నిరుద్యోగులకు అవకాశాలు కల్పించానని శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. కన్నా ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ సౌజన్యంతో శుక్రవారం పట్టణంలోని విద్యా కేంద్రంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది.నలభై కంపెనీలు, పదకొండు వందలమంది నిరుద్యోగ అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొన్నారు. వీరిలో 382 మందికి పైగా ఇంటర్వ్యూలో సెలెక్ట్ అవ్వడం జరిగింది. ఎంపికైన వారికి నియామక పత్రాలను ఆయన అందించారు ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరల తిరిగి జాబ్ మేళా నిర్వహించి నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. శాసనసభ్యులు అభ్యర్థులతో నేరుగా మాట్లాడారు. అర్హతకు తగిన ఉద్యోగాన్ని ఎంపిక చేసుకొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీవితంలో స్థిరపడితే





కుటుంబానికి భరోసా లభిస్తుందన్నారు.జాబ్ మేళా నిర్వహించడానికి సహకరించిన కంపెనీలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపికైన అభ్యర్థులను అభినందించారు. కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంట్ తెదేపా ఉపాధ్యక్షులు దరువూరి నాగేశ్వరరావు, ముప్పాళ్ళ ఎంపీపీ కళ్లెం వీర భాస్కర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, పట్టణ మండల పార్టీల అధ్యక్షులు మస్తాన్ వలి, బత్తుల నాగేశ్వరరావు, అంచుల నరసింహారావు, చౌటా శ్రీనివాసరావు, ప్రభుదాసు, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారులు, కూటమి నాయకులు తదితరులు ఉన్నారు.

# శిక్షణ కార్యక్రమాల షెడ్యూల్ ముందుగా విడుదల చేయాలి

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాలు పక్కాగా జరగాలని, ఆసక్తిగల అభ్యర్థులు పాల్గొనుటకు అవకాశం ఉండాలని, ఆ మేరకు వివరాలు ప్రతీ ఒక్కరికి తెలియాలన్నారు. నాణ్యతతో కూడిన శిక్షణ ఉండాలని, శిక్షణ పొందిన ప్రతీ ఒక్కరూ ప్రయోజనం పొందాలని స్పష్టం చేశారు. ముద్ర రుణాలు క్రింద చిన్న మొత్తాలు అవసరం ఉన్న వ్యక్తులు ఎక్కువ మంది ఉంటారని, వారికి ఎక్కువ అవకాశం కల్పించాలని సూచించారు. తద్వారా ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి మాట్లాడుతూ జనవరి 22వ తేదీ నుండి 862 దరఖాస్తులు సింగిల్ విండో లో అందగా 798 దరఖాస్తులకు మంజూరు ఇవ్వడం జరిగిందన్నారు. పెట్టుబడి రాయితీ కింద రూ.2.77 కోట్లు మంజూరు చేయడం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ ఎం.డి. నజీనా బేగం, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, ఆర్.టి.ఓ కె.శ్రీహరి, పర్యాటక అధికారి రమ్య, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె రామ అప్పల నాయుడు, జిల్లా ఉపాధి కల్పన అధికారి మరియు ఇన్ ఛార్జ్ జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు డి.దుర్గా భాయి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

# కొండ పండుగకు సర్వం సిద్ధం..!

మొదటి పేజీ తరువాయి

కొండవీడు ప్రధానమైంది. దాదాపు 1200 అడుగుల ఎత్తులో కొండపైన నిర్మితమైన అబ్బురపరిచే నిర్మాణ సౌధం. 3 కి.మీ మేర నిర్మించిన భారీ కుడ్యాలు (గోడలు), రాజప్రాసాద అవశేషాలు, గుప్త సొరంగాలు, కొండపైనే నిర్మించిన జలాశయాలు (చెరువులు), ఆయుధ శాలలు, ఆధ్యాత్మిక జీవనం పెంపొందించేందుకు నిర్మించిన అపురూప ఆలయాలు ఇంతటి సమ్మిళిత నిర్మాణ విశిష్టత కొండవీడు కోటకు మాత్రమే సొంతం.

**ఎన్డీయే ప్రభుత్వం వచ్చాకే కొండవీడుకు మహర్దశ..**

మరలా 2024లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాకే కొండవీడు కోటకు మహర్దశ మొదలైంది. గతంలో తన మనసులోని ఆలోచనలకు కార్యరూపమిచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కొండవీడు పునర్ వైభవం పై దృష్టి సారించారు. ఆ క్రమంలో గతంలో నిర్మించిన ఘాట్ రోడ్డుకు అనుసంధానిస్తూ, రాజధాని ప్రాంతం నుంచి కొండవీడుకు తరలివచ్చే పర్యాటకుల సౌలభ్యం కోసం చౌడవరం వద్ద రూ.220 కోట్లతో కొండను తొలిచి టన్నెల్ నిర్మించే ప్రతిపాదనపై దృష్టి పెట్టారు.ప్రపంచ పర్యాటక ప్రదేశంగా కొండవీడును తీర్చిదిద్దాలన్న పాలకుల ఆశయంలో భాగంగా నేడు,రేపు భారీ స్థాయిలో కొండవీడు ఉత్సవాలకు శ్రీకారం చుట్టడం జరిగింది. ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. ఈ రెండు రోజులు నిర్వహించే ఉత్సవాలతో కొండవీడు ప్రాంత ఖ్యాతి నలుదిశలా వ్యాపింప జేయడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం.

**అబ్బురపరిచే వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు..**
**నోరూరించే వంటకాలు..**

వారం రోజులు నుంచి అధికార యంత్రాంగం నిర్విరామ కృషితో కొండవీడు కోటకు వెళ్లే రోడ్ల నిర్మాణం, విస్తరణ పనులతో పాటు.. కోట పైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగింది. ఉత్సవాలకు వచ్చే పర్యాటకుల భద్రత, ఆనందాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి అంశాన్ని సునిశితంగా గమనించి ఏర్పాట్లు చేయడం జరిగింది. తొలిరోజు (శనివారం) ఉదయం యోగాతో ప్రారంభమయ్యే ఉత్సవాలు.. ఆదివారం రాత్రి వరకు కొనసాగే సాంస్కృతిక కార్యక్రమాలతో ముగియనున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా హెలికాప్టర్ రైడ్, శాండ్ ఆర్ట్, రాక్ క్లైంబింగ్, ఫైర్ క్రాకర్స్ షో, హార్స్ రైడింగ్, ఫ్లవర్ షో, బోటింగ్, చిన్నారులకు ప్రత్యేక ప్లే జోన్, ప్రత్యేక ఎగ్జిబిషన్ ఏర్పాట్లు ప్రధానాకర్షణగా నిలవనున్నాయి. జబర్దస్త్ బృందం నవ్వుల విందు.. గాయనులు గీతామాధురి, సమీరా భరద్వాజ్ సంగీత విభావరితో కూడిన ఆటపాటలు, విందువినోతాలతో అలసిపోయిన పర్యాటకుల అభిరుచికి



తగినట్టు.. నోరూరించే రుచులతో ఫుడ్ ఫెస్ట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇన్ని విశిష్టతలు.. విభిన్నతలు.. విందు, వినోదాలకు నిలయమైన కొండవీడు కోట అందాలను, చారిత్రక వైభవాన్ని ప్రతి ఒక్కరూ కన్నులారా, మనసునిండా ఆస్వాదించాలని ప్రభుత్వం తరపున కలెక్టర్ కృత్తిక శుక్లా కోరుతున్నారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, దేవాదాయమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు చేతులుమీదుగా నేడు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యే ఉత్సవాలకు ప్రజలు వేలాదిగా తరలి రాలని ఆమె ఒక ప్రకటనలో కోరారు. అలాగే కొండవీడు ఉత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు రూరల్ సీఐ సుబ్బానాయుడు తెలిపారు.ఎస్పీ కృష్ణారావు నేతృత్వంలో , డిఎస్పీ హనుమంతరావు పర్యవేక్షణలో ట్రైనీ డీఎస్పీ జయ కృష్ణ,తనతోపాటు ముగ్గురు సీఐ లు,15 మంది ఎస్ఐ లు,180 మంది సిబ్బంది తో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# పాలకులు మంచి వాళ్ళయితేనే రాజ్యాంగ ఫలాలు దక్కుతాయి

## - మాజీ ఎమ్మెల్సీ కె.యస్. లక్ష్మణరావు



**గుంటూరు కలెక్టరేట్ మెసేజ్ న్యూస్:** భారత రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్. అంబేద్కర్ పేర్కొన్నట్లుగా రాజ్యాంగం ఎంత గొప్పదైనా అమలు చేసే పాలకులు నిజాయితీ పరులైతేనే రాజ్యాంగ ఫలాలు ప్రజలందరికీ అందుతాయని శాసనమండలి మాజీ సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు తెలిపారు. ఈనెల 5వ తేదీ సాయంత్రం బ్రాడీపేట నందు రాజ్యాంగ చర్చా వేదిక ఆధ్వర్యంలో అధ్యక్షులు నడిం పల్లి గురుదత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కె.ఎస్.లక్ష్మణరావు రచించిన భారత రాజ్యాంగ నిర్మాణం – రాజ్యాంగ పీఠిక, పుస్తకాన్ని వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి,భారత రాజ్యాంగం – ముఖ్యాంశాలు పుస్తకాన్ని నర్రా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. కె.యస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ నేడు కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా రాజ్యాంగ మౌళిక స్వరూపాన్ని మార్చే విధంగా, ఫెడరిలిజాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని, ఈ పెనుముప్పు నుండి కాపాడాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థదే అని పేర్కొన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ అధికార పార్టీలు పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని ప్రశ్నించే ప్రతిపక్ష నేతలపై భౌతిక దాడులకు పాల్పడుతున్నాయని, బాధితులనే నిందితులుగా మార్చి జైళ్ళకు పంపే పరిస్థితి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని వివరించారు. ఇండియన్ లాయర్స్ యూనియన్ కార్యదర్శి, హైకోర్టు సీనియర్ న్యాయవాది నర్రా శ్రీనివాసరావు ప్రసంగిస్తూ భారత రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న లౌకికవాదం, సామ్యవాద భావాలకు తిలోదకాలిస్తూ మత రాజ్యంగాన్ని మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని భారతీయులందరూ ఐక్యంగా ప్రతిఘటించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి, సంయుక్త కార్యదర్శి టి. సేవ కుమార్, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయ రెడ్డి, అవగాహన సంస్థ వ్యవస్థాపకులు కొండా శివరామిరెడ్డి, ప్రోగ్రెస్ ఫోరం కార్యదర్శి పి.వి.మల్లికార్జు నరావు, బీసీ మహా జనసభ అధ్యక్షులు ఉగ్గం సాంబశివరావు, ఎల్ ఎస్ భార్గవి,స్టూడెంట్స్ యూనియన్ ఫర్ నేషన్ ఆశిష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# దాచేపల్లి మండలంలో యూరియా కొరత లేదు

## -ఏఓ వెంకటేష్

దాచేపల్లి, మేజర్ న్యూస్ : జిల్లాలో ఎరువుల పంపిణీపై,లభ్యత కు సంబంధించి పల్నాడు జిల్లా దాచేపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్ పూర్తి వివరాలు తెలిపారు.శుక్రవారం ఈ మేరకు పత్రికా ప్రకటన లో పలు అంశాలను వివరించారు. ప్రస్తుత పంటల పరిస్థితి, అవసరాలను బట్టి రైతులకు యూరియా సరఫరా జరుగుతుందన్నారు.దాచేపల్లి మండలంలో ప్రస్తుతం సుమారు 7,000 ఎకరాల్లో వివిధ పంటలు సాగులో ఉన్నాయని ,యూరియా అవసరం ప్రధానంగా వరి పంటకు అవసరముందన్నారు.మండలం లోని పెదగార్లపాడు, భట్రుపాలెం,గామాలపాడు, కేసనుపల్లి, దాచేపల్లి , నడికుడి గ్రామాల్లో వరి పంట ప్రస్తుతం పిలక దశ లో ఉందన్నారు.మొక్కజొన్న పంట ప్రస్తుతం సుమారు 40 నుండి 70 రోజుల వయస్సులో ఉందని,ఈ పంట కు కూడా యూరియా అవసరముందన్నారు. మిర్చి పంట ప్రస్తుతం 150 నుండి 180 రోజుల ముదిరిన దశలో ఉందని, పైన పేర్కొన్న పంటల అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ శాఖ ఎరువుల సరఫరాను ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తోందన్నారు. మండలంలో యూరియా పంపిణీ వ్యవస్థ పటిష్టంగా ఉందన్నారు. ఇప్పటివరకు 1,452 మెట్రిక్ టన్నుల యూరియాను డి.సి.ఎం.ఎస్ , పి.ఎ.సి.ఎస్,మన గ్రోమోర్ సెంటర్ల తో పాటు ప్రైవేట్ డీలర్ల ద్వారా రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రాబోయే డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, అదనపు నిల్వలు ఉంచడం జరుగుతుందన్నారు. ఈ వారంలో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా మరో 100 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి రానుందని ఏఓ తెలిపారు.ధరల నియంత్రణ, పారదర్శకత విషయంలో శాఖా పరంగా కఠినమైన నిబంధనలు అమలు చేయబడుతున్నాయన్నారు. దాచేపల్లి మండలంలో ఎక్కడా గరిష్ట రిటైల్ ధర ఉల్లంఘనలు జరగటం లేదన్నారు. అధిక ధరలకు సంబంధించి రైతుల నుండి ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదులు కూడా అందలేదన్నారు.

# ఆక్రమణలు చేస్తే సహించేది లేదు

## - కమీషనర్ అప్పలనాయుడు



**తెనాలి, మేజర్ న్యూస్ :**పట్టణంలోని 27వ వార్డు లో కమీషనర్ అప్పలనాయుడు, ప్రజారోగ్య శాఖ అధికారి మొవ్వ ఏసుబాబు లు కౌన్సిలర్ బోయపాటి అరుణతో కలిసి పర్యటించారు. ఎన్టీఆర్ రోడ్డు, పాండురంగపేట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పంటకాలువను పరిశీలించి కాలువలో చెత్త ఇతర వ్యర్థాలు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్టీఆర్ రోడ్డులో మురుగు. నీటిపారుదల కాలువలపై ఉన్న నాపరాళ్ళు ,ఇతర ఆక్రమణలను జెసిపి ద్వారా తొలగించారు. కాలువలపై ఆక్రమణలు చేయవద్దని నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తామనిస్థానికులకు సూచించారు. రోడ్లపై, కాలువలపై ఆక్రమణలు చేసిన ఇరువురికి జరిమానా కట్టించాలని సంబంధిత సెక్రటరీ నీ ఆదేశించారు. వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచన చేశారు. కాలువలలో సిల్ట్ తీయించారు. ఆ ప్రాంతంలో ఉన్న కమ్యూనిటీ టాయిలెట్ల వద్ద చెత్త ఉండడాన్నీ గమనించి సిబ్బంది చేత తొలగింప చేశారు. కమ్యూనిటీ టాయిలెట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వార్డు లో జరుగుతున్న మంచినీటి సరఫరాను పర్యవేక్షించి, సరఫరా విధానంపై సిబ్బందిని ఆరా తీశారు. పాండురంగపేట మెయిన్ రోడ్ లో గల కల్వర్టు ను పరిశీలించి మురుగు నీటిపారుదలకు ఆటంకం లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. డిఈ శ్రీనివాసరావు, సానిటరీ సెక్రటరీలు, ప్లానింగ్ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది, టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్, బిపిఎస్ లకై అందిన అన్ని అర్జీలు అర్హత మేరకు పరిష్కరించాలి



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో లే అవుట్ రెగ్యులేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్), బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బిపిఎస్) లకు అందిన దరఖాస్తులను ఈ నెలాఖరులోపు అన్నిస్థాయిల్లో పరిష్కారం చేసేలా సిటి ప్లానర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ చాంబర్ లో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత నగరంలో బిపిఎస్, ఎల్ఆర్ఎస్ లకు అందిన దరఖాస్తులు, ఫీజులు, ప్రాసెస్ విధానం, పెండింగ్ దరఖాస్తులను తెలుసుకొని మాట్లాడుతూ వార్డ్ సచివాలయాల వారీగా ప్లానింగ్ కార్యదర్శులు తమ లాగిన్ ల లో ఉన్న అప్లికేషన్లను సమగ్రంగా పరిశీలించి, వారం రోజుల్లో ఫార్వార్డ్ చేయాలన్నారు. దరఖాస్తుల్లో లోపాలు లేకుండా ఉండడానికి ఎల్టీపీలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలని సిటి ప్లానర్ ని ఆదేశించారు. నిర్దేశిత ఫీజులను కూడా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనధికార నిర్మాణాలు, వాటిపై తీసుకున్న చర్యలపై రోజువారీ నివేదిక ఇవ్వాలన్నారు. మీడియా డిస్ప్లే ఫీజులకు సంబంధించి సమీక్షించి, పాత, ప్రస్తుత బకాయిలు నూరు శాతం మార్చి నాటికి, ఈ నెలాఖరుకి 70 చెల్లించాలన్నారు. ప్రతి పెద్ద హోర్డింగ్ ప్రతి ఏడాది స్ట్రక్చరల్ సర్టిఫికేట్ ఇవ్వాలన్నారు. గత ఏడాది డిశంబర్ లో రాష్ట్ర ప్రభుత్వం మీడియా డివైజ్ డిస్ప్లే పై జారీ చేసిన ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రోడ్ల విస్తరణపై మాట్లాడుతూ విస్తరణ జరిగిన ప్రాంతాల్లో నిబందనల మేరకు ఇవ్వాల్సిన నష్ట పరిహారాలు, టిడిఆర్ బాండ్లు జాప్యం లేకుండా అందించాలన్నారు. మాస్టర్ ప్లాన్ మేరకు ఇప్పటి వరకు విస్తరణ చేపట్టిన రోడ్లు, చేపట్టాల్సిన రోడ్ల వివరాలతో నివేదిక ఇవ్వాలని, జిఎంసికి అదనపు సర్వేయర్ల కోసం సంబంధిత ఏడి, సర్వేతో సమన్వయం చేసుకోవాలని సిటి ప్లానర్ ని ఆదేశించారు. సమావేశంలో సిటి ప్లానర్ రాంబాబు, డిసిపి సూరజ్ కుమార్, ఏసిపిలు రెహ్మాన్, జకీరా, టిపిఎస్ లు, టిపిబిఓలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

# 8న ఎస్ .హెచ్.ఓ.లో చర్మవ్యాధుల ఉచిత వైద్య శిబిరం

**గుంటూరు మేజర్ న్యూస్ :** సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ ,మానవత స్వచ్ఛంద సేవా సంస్థసంయుక్తంగా ప్రతినెల రెండో ఆదివారం "స్పెషలిస్టుల ఉచితవైద్య శిబిరాల "లో భాగంగా 8వ తేదీ ఆదివారం "చర్మవ్యాధుల ఉచిత వైద్య శిబిరం, శాస్త్రీయ అవగాహన సభ "నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి .సేవకుమార్ ,పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు 2/1 బ్రాడీపేట లోని ఎస్ .హెచ్. ఓ భవనంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో చర్మ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ డి. అమర్ పాల్గొంటారన్నారు. ఈ శిబిరానికి ముందు మధుమేహం బాధితులలో చర్మసంబంధ వ్యాధులు , చికిత్స విధానాలు,జీవన సరళిలో మార్పులు, తదితర అంశాలపై శాస్త్రీయ అవగాహన సభ ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా వారు ఆ ప్రకటనలో కోరారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ



**తెనాలి, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తున్నదని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. తెనాలి నియోజకవర్గంలోని 25 మంది వైద్య చికిత్స కోసం, రూ. 14.75 లక్షల మంజూరు పత్రాలను ఆయన శుక్రవారం లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం కృషి - ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి, మేజర్ న్యూస్ :** ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ లో ఆయన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. ప్రజల నుండి వచ్చిన పిర్యాదులు ఆయా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం వారి 97వ ఆధ్వర్యంలో అన్నదానం



**వినుకొండ మేజర్ న్యూస్:** వినుకొండ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం వారి కార్యాలయ ఆవరణలో శుక్రవారం కీర్తిశేషులు పులుపుల పద్మావతి జ్ఞాపకార్థం భర్త పులుపుల సీత రామాంజనేయులు సహకారంతో 97వ అన్నదాన కార్యక్రమాన్ని వారి చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం సంఘ కార్యక్రమాల గురించి భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దాతల సహకారంతో నిర్విరామంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఇదేవిధంగా సంఘ సభ్యులు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అవ్వారు కోటేశ్వరరావు, వై వి సుబ్బయ్య శర్మ, గోపి, రామలింగేశ్వరరావు, ఎం వి శర్మ, జి నాగేంద్రుడు, పి నారాయణరావు, ఆది రాములు, కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, రాఘవయ్య,రఘు, శంకర్రావు, దీక్షితులు, వెంకట స్వామి, హనుమంతరావు, సుబ్రహ్మణ్యం, మస్తాన్, హసన్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి నిల్వలను తొలగిద్దాం, దోమల వృద్ధిని అరికడదాం



**తెనాలి, మేజర్ న్యూస్ :** పట్టణంలోని పద్మశాలిపేటలో ఫ్రై డే డ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాలతో పాటు తమ ఇంటి లోపల కూడా నిల్వ నీటిలను వారానికొక్కసారైనా మార్చుకొనుట ద్వారా దోమలు గుడ్లు పెట్టుటకు అవకాశం ఉందన్నారు. తద్వారా దోమలు ఉత్పత్తి అరికట్టవచ్చునని చెప్పారు. దోమల ద్వారా వ్యాపించి మలేరియా డెంగ్యూ చికెన్ గునియా మెదడువాపు బోదకాలు జికా వైరస్ వంటి వ్యాధుల ప్రబలతను నివారించ వచ్చునని అన్నారు. తెనాలి పట్టణ యు ఎల్ బి ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి చెక్ క్లీన్ కవర్ విధానాన్ని ప్రతి ఒక్కరు పాటించాలని, వారానికి ఒక్కసారి నీటి నిల్వలను చెక్ చేసుకుని వాటిని శుభ్రపరచుకొవాలన్నారు. ఇంటి పరిసరాలలోనూ ఎక్కడ నీటిని నిలవలు లేకుండా చూసుకొవాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా సూపర్వైజర్స్ దీపాల శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్స్ , ఏఎన్ఎం భాగ్యలక్ష్మి ,ఆశా కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ సమావేశాలు అర్థవంతంగా జరగాలని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



**వినుకొండ మేజర్ న్యూస్ :** ఈ నెల 11 నుండి జరగబోయే ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలు అర్థవంతంగా జరగాలనీ, సామాన్య ప్రజలకు ఉపయోగపడే అంశాలు చర్చ జరిగి, నిర్ణయాలు తీసుకునేలా ఉండాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. ఈ రోజు టీడీఎల్పి కార్యాలయంలో ప్రభుత్వ విప్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసెంబ్లీ సమావేశాలకు యంయలఏలు 100% శాతం హాజరు కావాలనీ, హజరైన వారు కూడా సభ జరిగినంత సేపు హాలులో వుండి సభాగౌరవాన్ని కాపాడాలని కోరారు. ప్రతిపక్ష వైసీపీ సభ్యులు కూడా సభకు హజరై తమ గౌరవాన్ని కాపాడు కోవాలని, ప్రజా సమస్యల పట్ల తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని అన్నారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఈ నెల 14వ తేదీన జనరంజక బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఛీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తో పాటు ప్రభుత్వ విప్‌లు కాల్వ శ్రీనివాసులు, పిజివిఆర్ నాయుడు గణబాబు యార్లగడ్డ వెంట్రావు, బోలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, శ్రీమతి యనవమల దివ్య తంగిరాల సౌమ్య మరియు టీడీఎల్పి సెక్రటరి కోనేరు సురేష్ పాల్గొన్నారు.

## ఉచితంగా స్టడీ మెటీరియల్ (మ్యాక్స్ ఒలంపియాడ్) పంపిణీ



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** పిడుగురాళ్ల పట్టణంలోని 17వ వార్డు శ్రీ బాబు జగజీవన్ రావ్ ప్రాథమిక ఉన్నత పాఠశాల (మిలిటరీ స్కూల్) నందు ఎంఈఓ ఏ1 శ్రీనివాస రెడ్డి, ఎంఈఓ 2 వై శ్రీనివాస రావు , ఆధ్వర్యంలో స్కూల్ హెడ్ మాస్టర్ ఆర్ కోటేశ్వరావు సొంత నిధులతో 1నుండి 5వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ( మ్యాక్స్ ఒలంపియాడ్) పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల పట్టణ అధ్యక్షులు పిల్లి చెన్నారావు , సొసైటీ మాజీ చైర్మన్ వడ్డవల్లి సర్వేస్వరావు , మున్సిపల్ వైస్ చైర్మన్ వున్నం ఆంజనేయులు , 17వ వార్డు ఇంచార్జి వర్ల రత్నం, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చల్లగుండ్ల రూబెన్, పిడుగురాళ్ల పట్టణ టీడీపీ సెక్రటరీ మేకల ఆంజనేయులు యాదవ్, మంద అరుణ్, 22వ వార్డు మాజీ కౌన్సిలర్ పణితి కాంతారావు, 5వ వార్డు ఇంచార్జి కందిమళ్ళ శ్రీనివాసరావు, 6వ వార్డు ఇంచార్జి బిజ్జిలి వెంకట్రావు, 16వ వార్డు ఇంచార్జి జమ్మిశెట్టి రామకృష్ణ (జెమిని), గడిపూడి సాంబశివరావు, బూత్ కన్వీనర్ బొక్క శ్రీను, ఐతం దేవదానం, గవర్నమెంట్ స్కూల్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ కార్యాలయానికి కంప్యూటర్ బహూకరణ



**ముప్పాళ్ల, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని నార్నెపాడు గ్రామానికి చెందిన వేమూరి సాంబశివ రావు రూ. 30 వేల విలువైన కంప్యూటర్ ను తహసిల్దార్ కార్యాలయానికి శుక్రవారం బహుకరించారు. ఈ సందర్భంగా సాంబశివరావు తహసిల్దార్ నగేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. నేడు మండల పరిషత్ సమావేశం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరగనుందని ఎంపీడీవో పి రత్నం తెలిపారు. ఎంపీపీ కళ్లెం వీర భాస్కర రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

# 10 వ తరగతి విద్యార్థులు అత్యున్నత మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



**గుంటూరు, కలెక్టరేట్, మేజర్ న్యూస్ :** జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులు నూరు శాతం అత్యున్నత మార్కులతో ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో విద్యాశాఖ, సంక్షేమ శాఖల వసతి గృహాల అధికారుల ప్రణాళిక ప్రకారం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పదవ తరగతి పరీక్షల వంద రోజుల ప్రణాళిక అమలు, తక్కువ పెర్ఫార్మెన్స్ లో ఉన్న పదవ తరగతి విద్యార్థులను సంక్షేమ హాస్టల్స్ ఉంచి ప్రత్యేక శిక్షణ అందించే కార్యక్రమం సన్నద్ధత ఏర్పాట్లు పై ఎంఈఓలు,, ప్రధానోపాధ్యాయులు, ఎస్సీ, ఎస్టీ బీసీ వసతి గృహాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులలో చదువులో వెనుకబడిన వారిని తల్లిదండ్రుల అనుమతితో పరీక్షలు ప్రారంభం అయ్యే వరకు సమీపంలోని సంక్షేమ హాస్టళ్లలో ఉంచి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు పాఠశాలలో ఉపాధ్యాయులు, వసతి గృహాల సంక్షేమ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఒక్క రోజు కూడా గైర్హాజరు అవకుండా పర్యవేక్షించాలన్నారు. వంద రోజులు ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న పరీక్షలలో రైజింగ్ స్టార్స్ కేటగిరీలో వారిని షైనింగ్ స్టార్స్ గా తీర్చిదిద్దాలన్నారు. తక్కువ పెర్ఫార్మెన్స్ లో ఉన్నవారిని సబ్జెక్ట్ వారీగా మార్కులు మెరుగుపర్చేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లోని పదవ తరగతి విద్యార్థులకు సక్రమంగా స్టడీ తరగతులు నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో ప్రతి రోజు నిర్వహిస్తున్న పరీక్షలలో సాధించిన మార్కుల ఆధారంగా, ఏదైనా సబ్జెక్టులో వెనుకబడి ఉంటే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయ దృష్టికి తీసుకువెళ్లి మంచి మార్కులు సాధించేలా వార్డెన్లు చర్యలు తీసుకోవాలన్నారు. పదవ తరగతిలో పరీక్షలు సమీపిస్తున్నందుకు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అనారోగ్య సమస్యలు ఉంటే ఇప్పుడే వారికి వైద్యులతో పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం, పరిశుభ్రమైన వాతావరణంలో అందించాలన్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లోని పదవ తరగతి విద్యార్థులు ఇబ్బందులు లేకుండా ఎంఈఓ లు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు చెన్నయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి సలీం భాషా, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి, బీసీ సంక్షేమ శాఖ అధికారి మయూరి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మురళీధర్, జిల్లా పరిక్షల విభాగం ససెక్రటరీ ఎ తిరుమలేశ్ పాల్గొన్నారు.

## శ్రావణ కుమారి అభినందనీయురాలు


### బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు



**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో భారతదేశంలో అతిపెద్ద సంస్థ మిర్చి యార్డ్ డైరెక్టర్ గా సీనియర్ నాయకురాలు మాజీ కార్పొరేటర్ అయినటువంటి కె. శ్రావణ కుమారినీ నియమించినందుకు జిల్లా ఆఫీస్ వాజ్పాయ్ భవన్ లో వారిని అభినందించడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాకు ఈ బాధ్యత ఇచ్చిన పివిఎన్ మాధవ్ కి మధుకర్ జీకి, జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావుకి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. యార్డుకు వచ్చిన రైతుల కష్టసుఖాలను తెలుసుకొని వారు అమ్మిన సరుకు సక్రమంగా నగదు చెల్లించే విధంగా పనిచేస్తానని సభాపూర్వకంగా హామీ ఇస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు నేరెళ్ల మాధవరావు జూపూడి రంగరాజు కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ సుబ్బారావు ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కుమార్ గౌడ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేసు సత్యనారాయణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు షేక్ సాంబశివరావు కార్యదర్శి నారాయణరెడ్డి జిల్లా సంయోజక్ భీమినేని చంద్రశేఖర్ జిల్లా కోశాధికారి రమణ రాజేష్ నాయుడు షేక్ సాంబశివరావు సీనియర్ నాయకులు అప్పిశెట్టి రంగా కారంశెట్టి రమేష్ రామకృష్ణ రావూరి లక్ష్మీనారాయణ శాస్త్రి రాజు మరియు మండల అధ్యక్షులు ఇతర ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషులు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేసినారు.

## బకాయిల చెల్లింపు లేదా భూముల కేటాయింపు శాసనమండలిలో తమ వాణి వినిపించాలి

### - ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని కోరిన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు చాలా న్యాయమైనవని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి అభిప్రాయపడ్డారు. ఆ సమస్యలు పరిష్కరించకపోగా వారి హక్కులను కూడా కాలరాయాలని చూడడం సమంజసం కాదని ఆయన హితవు పలికారు. తక్షణమే వాటిని పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల తరుపున శాసనమండలిలో తమ వాణి వినిపించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు గుంటూరులోని ఎమ్మెల్సీ నివాసంలో ఆయనను కలిసి తమ సమస్యలను ఆయనకు సమగ్రంగా వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు వేతన సవరణ చేసి మెరుగైన పిఆర్సీ ఇవ్వాల్సిందే అన్నారు. ముగ్గురు సభ్యులతో వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేసి, దాని నివేదిక వచ్చే లోపు మధ్యంతర భృతి ప్రకటించాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టివి రామిరెడ్డి, వై నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## డ్రగ్స్‌కి వ్యతిరేకంగా 3,500 కిలోమీటర్ల పాదయాత్ర

### - విద్యార్థులను అభినందించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసిన సిఐ వెంకట్రావు

**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** డ్రగ్స్ ముప్పు సమాజాన్ని కబళిస్తున్న ఈ కాలంలో యువతను చైతన్యవంతం చేయాలనే లక్ష్యంతో ఇద్దరు యువకులు సాహసోపేతమైన పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. డ్రగ్స్ లేని సమాజం కోసం అనే నినాదంతో హైదరాబాద్ నుంచి కన్యాకుమారి వరకు, కన్యాకుమారి నుండి న్యూఢిల్లీ వరకు సుమారు 3,500 కిలోమీటర్లు నడుచుకుంటూ ప్రయాణం చేస్తూ ప్రజలకు, విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం పల్నాడు జిల్లా తుమ్మలచెరువు టోల్‌గేట్ సమీపంలో శ్యామ్, కిరణ్ అనే యువకులు పాదయాత్ర చేస్తూ పిడుగురాళ్ల పట్టణ సీఐ వెంకటరావు కు కనిపించారు. వారి సంకల్పం, సమాజంపై ఉన్న బాధ్యతను గమనించిన సిఐ వెంకట్రావు వారికి అభినందనలు తెలిపారు. పిడుగురాళ్లలోని జెడ్పీహెచ్ పాఠశాలలో వారితో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు అలవాటు పడితే భవిష్యత్తు అంధకారమవుతుందని, యువత తమ శక్తిని విద్య, క్రీడలు, సృజనాత్మకత వైపు మళ్లించాలని విద్యార్థులకు హృదయానికి హత్తుకునేలా



వివరించారు. విద్యార్థులు కూడా ఈ కార్యక్రమానికి మంచి స్పందన చూపిస్తూ, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. పట్టణ ప్రాంతాల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మరింత అవసరమని పలువురు అభిప్రాయపడ్డారు. సమాజ హితాన్ని దృష్టిలో పెట్టుకొని, స్వయంకృషితో, స్వయంవ్యయంతో ఇంతటి సుదీర్ఘ పాదయాత్ర చేస్తూ యువతను రక్షించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్న శ్యామ్, కిరణ్‌ల సేవలు అభినందనీయం అన్నారు.


# విమర్శలను అంగీకరిస్తేనే విజయం సాధ్యం



- ఇండియన్ ఫిల్మ్ డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం
- ◆ నేర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకోవాలి : విజ్ఞాన్స్ వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్
- ◆ రెండోరోజు వైభవంగా కొనసాగిన విజ్ఞాన్ మహోత్సవ్ 2కె26

**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ :** నేటి ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 2025 ఏసియన్ చాంపియన్‌షిప్ గోల్డ్ మెడలిస్ట్, భారత హెప్టాథ్లెట్ నందిని అగసారా ఒకటి కాదు.. రెండు కాదు... ఏకంగా 80 ఈవెంట్లు. కనుచూపు మేర ఎటువైపు చూసినా విద్యార్థులు క్రీడా సంబరాల్లో మునిగిపోయారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, త్రోబాల్, ఫుట్‌బాల్, హాకీ, తైక్వాండో, ఖోఖో, ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్, యోగాసన... ఇలా ఒకటేమిటి అనేక విభాగాల్లో విద్యార్థులు అద్భుత ప్రదర్శనలతో ఉర్రూతలూగించారు. ఒకరితో ఒకరు నువ్వా నేనా అన్నట్లు పోటీపడి విజయాలు సాధిస్తున్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జరుగుతున్న జాతీయస్థాయి విజ్ఞాన్ మహోత్సవ్ 2కె26 పోటీలు విద్యార్థులను ఆసాంతం అబ్బురపరిచింది.

మంచి విమర్శలను అంగీకరిస్తేనే మీరు విజయం సాధించగలరని ఇండియన్ ఫిల్మ్ డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం ( చాంపియన్ మూవీ) అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి 19వ ఎడిషన్ విజ్ఞాన్స్ మహోత్సవ్ కార్యక్రమం రెండో రోజు శుక్రవారం సందడి సందడిగా సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇండియన్ ఫిల్మ్ డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం ( చాంపియన్ మూవీ) మాట్లాడుతూ ప్రారంభ దశలో ఉన్నవారైనా, అనుభవజ్ఞులైనా తప్పులు చేయడం సహజమని పేర్కొన్న ఆయన, మంచి విమర్శలను అంగీకరించడం ద్వారా మాత్రమే వ్యక్తి ఎదుగుదల సాధ్యమని వివరించారు.



ప్రతి ఒక్కరూ ఎప్పుడూ నేర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకోవాలని విజ్ఞాన్స్ వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ అన్నారు. దేశం నలుమూలల నుండి వచ్చిన క్రీడాకారులతో ఆడే అవకాశం ద్వారా, అనుభవాన్ని పెంపొందించుకునే అవకాశం లభిస్తుందన్నారు.

జాతీయ స్థాయి విజ్ఞాన మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న పోటీల్లో విద్యార్థులు నువ్వా నేనా అన్నట్లు పోటీపడుతున్నారు. అథ్లెటిక్స్‌లో భాగంగా 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందేలను నిర్వహించారు.

**నేడు సందడి చేయనున్న క్రీడా, సినీ తారలు**

విజ్ఞాన్స్ మహోత్సవ్‌లో భాగంగా శనివారం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 2025 ఏసియన్ చాంపియన్‌షిప్ గోల్డ్ మెడలిస్ట్, భారత హెప్టాథ్లెట్ నందిని అగసారా విచ్చేస్తున్నారని ఇంచార్జి వైస్ చాన్స్‌లర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, ఇంచార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

## మహిళలకు అండగా జి ఆర్ సి కేంద్రాలు

- ■ "జెండర్ రిసోర్స్ సెంటర్" ను ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా
- ■ పొదుపు మహిళలకు అన్ని సేవలు అందుబాటులో ఉంటాయి
- ■ డి ఆర్ డి ఎ పి డి ఝాన్సీ




**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** మహిళల సామాజిక, ఆర్థిక, సాధికారత, వృత్తి నైపుణ్య శిక్షణ, చట్టపరమైన సహాయం, కౌన్సెలింగ్, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు జెండర్ రిసోర్స్ కేంద్రాలు పనిచేస్తాయని శాసనసభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ధూళిపాళ్ళ గ్రామంలో డి ఆర్ డి ఎ- వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించబడే కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పిడి ఝాన్సీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ..స్వయం సహాయక సంఘాలు (కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ లు) తమకు సంబంధించిన సమస్యలను ప్రస్తావించడానికి, సేవలను అందించే సంస్థలతో సంబంధాలు ఏర్పరచుకోవడానికి, సంబంధిత శాఖ నుండి అవసరమైన సహాయం పొందడానికి వేదికగా జెండర్ రిసోర్స్ సెంటర్ లు పని చేస్తాయన్నారు. అలాగే మహిళలు, సమాజంలోని పీడిత వర్గాలపై జరిగే హింస మరియు వివక్షకు కారణమయ్యే వ్యవస్థా పరమైన సామాజిక అడ్డంకులను తొలగించడానికి అవగాహన కలిగిస్తుందన్నారు. గ్రామీణ మహిళలకు పీడిత వర్గాలకు ఒకే వేదిక ద్వారా సమగ్ర సహాయం సత్వర సేవలు మరియు మార్గ దర్శకత్వం అందించాలన్నారు.

డిఆర్డిఏ పి డి ఝాన్సీ మాట్లాడుతూ 3 సంవత్సరాల పాటు ఈ జెండర్ కేంద్రమును నిర్వహణ కొరకు జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్ సహకారంతో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మహిళను లక్షాధికారిని చేయాలనే పట్టుదలతో సంక్షేమ పథకాలతో పాటు ఆర్థిక అభివృద్ధికి పొదుపు సంఘాలకు అవసరమైన నిధులను అందిస్తున్నారు. పొదుపు సభ్యులకు అవసరమైన అన్ని సేవలు ఈ జెండర్ కేంద్రంలో లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమం లో నరసరావు పేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు దరువూరి నాగేశ్వరరావు, తవిటి భావన్నారయణ, తోట అంబిక, ఎపియం సమాధానం,స్థానిక నాయకులు తదితరులున్నారు.

# ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామిక వేత్త కావాలి

- ఎమ్మెల్యే డా॥ బూర్ల రామాంజనేయులు




**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** ప్రతి కుటుంబం నుండి ఒకరు పారిశ్రామిక వేత్త కావాలని ప్రత్తిపాడు శాసన సభ్యులు డా.బూర్ల రామాంజనేయులు అన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ స్థాయి బ్యాంకర్ల సమావేశం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామికవేత్త రావాలని పిలుపునిచ్చారని, ఆ మేరకు అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని అవకాశాలను వినియోగించుకోవడం ద్వారా పారిశ్రామిక వేత్తలుగా తయారు కావచ్చని చెప్పారు. ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, బ్యాంకర్ల సమన్వయము సహకారం అవసరమని పేర్కొన్నారు. ఎక్కువ మంది ఒక గ్రూపుగా ఏర్పడడం ద్వారా పారిశ్రామిక దిశగా వెళ్ళుటకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. వట్టిచెరుకూరు, పెదనందిపాడు, ప్రత్తిపాడు, కాకుమాను మండలాల్లో బల్క్ కూలింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి పాల సేకరణ చేయుటకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. ప్రతి రోజు కనీసం 5 వేల లీటర్ల పాల సేకరణ చేయుటకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గ్రూప్ లుగా ఏర్పడి డ్రోన్ల క్రయ విక్రయాలు చేయవచ్చని, రైస్ మిల్లులు వంటి వ్యవస్థలను ఏర్పాటు చేయవచ్చని అన్నారు. తద్వారా పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుటకు మంచి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. నియోజకవర్గంలో వరి, మిరప, పత్తి పంటలకు సంబంధించిన వివిధ యూనిట్లు నెలకొల్పుటకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. బ్యాంకర్లు ఈ ఏడాది రూ. 2,200 కోట్లు రుణాలు అందించారని, ఇటువంటి రుణాలను చక్కటి కార్యాచరణ ప్రణాళికతో మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం ద్వారా పెద్ద ఎత్తున అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని ఆయన అన్నారు. ప్రతి గ్రామం ఒక యూనిట్ గా లేదా రెండు, మూడు గ్రామాలు ఒక యూనిట్ గా ఏర్పడి చక్కటి వ్యవస్థను నెలకొల్పడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉంటాయని అన్నారు. పీఎం సూర్య ఘర్ క్రింద యూనిట్లు నెలకొల్పి నెలకొల్పవచ్చని తద్వారా సబ్సిడీ అందుతుందని చెప్పారు. సౌర విద్యుత్తు ఏర్పాటు చేసుకోవడం వలన సొంత వినియోగం చేసుకోవడమే కాకుండా మిగిలిన విద్యుత్తు యూనిట్లను విక్రయించవచ్చని చెప్పారు. ముద్ర రుణాల తీసుకుని చిన్న యూనిట్ల నుండి పెద్ద యూనిట్ల వరకు నెలకొల్పుటకు అవకాశాలు ఉన్నాయని అన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం డైరెక్టర్ సందీప్ బాబు వారు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, సహాయ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పట్టణ పరిధిలో విద్యుత్ కోత

**తెనాలి మేజర్ న్యూస్ :** విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా పట్టణ పరిధిలోని చెంచుపేట, ఇందిరానగర్, కోనేరు బజారు, స్టేడియం రోడ్డు, బస్టాండ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బోరుగడ్డ అశోక్ కుమార్ తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ కోత ఉంటుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



**దుగ్గిరాల మేజర్ న్యూస్ :** దుగ్గిరాల మండల గ్రామాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలో 35 పైగా చెక్కులను తెలుగుదేశం పార్టీ కూటమి నాయకులు పంపిణీ చేశారు గ్రామాలలోని. లబ్ధిదారుల ఇళ్ళకు వెళ్లి చెక్కులను అందజేశారు. మండల తెలుగుదేశం అధ్యక్షులు కే సం నేని శ్రీ అనిత, ఎంపీపీ షేక్ జబీన్, జనసేన అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసరావు, ఈమని గ్రామ సర్పంచ్ సిద్దెల శ్రీవాణి ఉజ్వల హరిణి, పెనుమూలి గ్రామ సర్పంచ్ కొరటాల విజయలక్ష్మి, ఎన్ సాంబశివరావు, కే ఫణీంద్ర, పఠాన్, నర్రా శ్రీనివాసరావు, కొరటాల భాస్కరరావు, నందిపాటి జోగారావు, కొరటాల సురేష్, బుజ్జి, రాజశేఖర్, మల్లేశ్వర రావు, వాసిరెడ్డి శ్రీనివాసరావు, విశ్వనాథంపల్లి శివకుమార్, యార్లగడ్డ రమణమ్మ, కే. సం నేని వాసు బాబు, సత్యనారాయణ, అఖిల్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## అవార్డును అందుకున్న దుగ్గిరాల మండల డిప్యూటీ ఎంపీడీవోకే జవహర్లాల్ నెహ్రూ




**దుగ్గిరాల మేజర్ న్యూస్ :** పన్నుల వసూళ్ల ఆన్లైన్ సేవలో జిల్లాలో ప్రథమ స్థానంలో ఉన్నందున దుగ్గిరాల డిప్యూటీ ఎంపీడీవో కే జవహర్లాల్ నెహ్రూ అవార్డును అందుకున్నారు. గుంటూరు జిల్లాలోని దుగ్గిరాల మండలం మొదటి స్థానంలో ఆన్లైన్ టాక్స్ కలెక్షన్ సేవ లో ముందు ఉండడంతో అవార్డును జిల్లా అధికారులు దుగ్గిరాలమండల డిప్యూటీ ఎంపీడీవో కే జవహర్లాల్ నెహ్రూ కు అందజేశారు. మండలంలో టాక్స్ కలెక్షన్ సేవలు ప్రథమ స్థానం దక్కించుకోవడంతో జిల్లా పంచాయతీ అధికారులు అవార్డును అందజేశారు. ఓ ఎస్ డి ఆనంద్, డిపిఒ నాగ సాయికుమార్, ఏడి స్పందన, డివిల్పిఒ స్వరూప రాని పాల్గొని డిప్యూటీ ఎంపీడీవో కేజే నెహ్రూ కుఅవార్డును అందజేశారు. అవార్డును అందుకున్న కేజే నెహ్రూను దుగ్గిరాల మండల ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీపీ షేక్ జబీన్, దేశం పార్టీ అధ్యక్షురాలు కే సం నేని శ్రీ అనిత, ఏవో చంద్రమోహన్, మండల అధికారులు తదితరులు అభినందించారు.

## పల్నాడు జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



**వినుకొండ మేజర్ న్యూస్ :** వినుకొండ పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ విస్తరణ అధికారుల నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా నరసరావుపేట లో విధులు నిర్వహిస్తున్న బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శి గా ఈపూరు మండలం లో విధులు నిర్వహిస్తున్న ఏఈఓ సునీత, అసోసియేట్ అధ్యక్షులు గా వినుకొండ ఏఈఓ ఆరిఫ్, కోశాధికారిగా బొల్లాపల్లి లో విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కమిటీ కార్యవర్గం వినుకొండ ఏడీఏ రవి కుమార్ ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఏడీఏ అభినందనలు తెలియజేశారు.

## ప్రముఖ సంఘ సేవకుడు పేదల పాలిట పెన్నిధిగా ముప్పాళ్ళ జ్ఞానేశ్వర్రావు




**వినుకొండ మేజర్ న్యూస్ :** నిరాశ్రాయులకు దుప్పట్లు, భోజనాల పంపిణి ప్రముఖ సంఘ సేవకులు, అడ్వకేట్, వినుకొండ AGP ముప్పాళ్ళ జ్ఞానేశ్వర్ రావు తన తండ్రి ముప్పాళ్ళ చెన్నయ్య గారి 10వ వర్ధంతిని పురస్కరించుకుని మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినుకొండ పట్టణంలోని నిరాశ్రయులకు మరియు నిరుపేదలకు భారీ ఎత్తున దుప్పట్లు మరియు భోజనాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. తన తండ్రి జ్ఞాపకార్థం ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జ్ఞానేశ్వర్ రావు, ఈ ఏడాది 10వ వర్ధంతిని పురస్కరించుకుని చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, రోడ్డు పక్కన నివసించే అభాగ్యులకు నాణ్యమైన దుప్పట్లను, ఆకలితో వున్నవారికి ఫౌండేషన్ సభ్యులతో కలిసి స్వయంగా భోజనం పంపిణి చేసారు. మా నాన్న నేర్పిన సేవా దృక్పథమే నన్ను ఈ స్థాయికి చేర్చింది. వారి జ్ఞాపకార్థం నలుగురికి సహాయం చేయడంలో ఉన్న తృప్తి మరెందులోనూ లేదు. యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ సభ్యుల సహకారం ఈ కార్యక్రమ విజయానికి ఎంతో తోడ్పడింది అన్నారు." కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు పమిడిపల్లి అనిల్ రాజ్, ఉపాధ్యక్షులు గుమ్మడి మనోహర్, జాయింట్ సెక్రెటరీ పెనుమాల వెంకట్రావు, ట్రెజరర్ k. సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీది మహా పాపం కాదు - మహా ఘాతకం

### పోస్టర్లను ఆవిష్కరించిన కూటమి నేతలు



**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ :** ప్రపంచ వ్యాప్తంగా హిందువులకు అత్యంత పవిత్ర స్థలమైన తిరుమల తిరుపతి దేవస్థాన పవిత్రతను దెబ్బతీసేందుకు చరిత్ర క్షమించని ఘోర అపచారాలకు మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి అతని అనుయయులు పాల్పడ్డారని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా తిరుపతి పవిత్రతను దెబ్బతీయటమే వైసీపీ నేతలు లక్ష్యం అంటూ మండిపడ్డారు. తిరుపతి లడ్డూ విషయంలో వైసీపీ చేసింది లిమహాపాపం కాదు – మహా ఘాతకంలి అంటూ ముద్రించిన గోడప్రతులను శ్రీనివాస రావుతోటలోని రామనామ క్షేత్రం వద్దనున్న భారతమాత విగ్రహం వద్ద శుక్రవారం కూటమి నాయకులతో కలిసి అయన ఆవిష్కరించారు. డబ్బు కోసం ఎంతటి నీచానికైనా, ఎలాంటి అపరాదానికైనా పాల్పడే వైసీపీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విమలా దేవి, శ్రావణ కుమారి, గోపు సాంబశివరావు, టీడీపీ డివిజన్ అధ్యక్షులు ఉల్లి గోపాల్, నీలం ప్రసాద్, బుజ్జి మేస్త్రి, అడపా హేమంత్, జనసేన నగర కార్యదర్శిలు బండారు రవీంద్ర, పాములూరి కోటి, కూటమి నాయకులు నాజర్ వలి, నందూరి స్వామి, కోలా అంజి, వడ్డే సుబ్బారావు, ఇళ్ళా చిరంజీవి, బద్రి, స్టూడియో బాలాజీ, తోట పవన్ కుమార్, సుబ్బారావు, శ్రీకాంత్, ముక్తుమ్ భాషా, జక్కా రాఘవులు, షంషేర్, తాడివాక రమేష్, రామకృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ సహకారంతో తోపుడు, టిఫిన్ బండి అందజేత

### మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు




**మంగళగిరి మేజర్ న్యూస్ :** ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ నియోజకవర్గంలోని ఇద్దరు చిరువ్యాపారులకు చేయూతనందించారు. మంత్రి నారా లోకేష్ సహకారంతో దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు గ్రామానికి చెందిన షేక్ అలీమ్‌బికి టిఫిన్ బండి, తాడేపల్లి 12వ వార్డుకు చెందిన రత్నకరం ఏడుకొండలకు తోపుడు బండి అందజేశారు. తమ వ్యాపారానికి అవసరమైన టిఫిన్, తోపుడు బళ్లు అందించాలని లబ్ధిదారులు మంత్రి నారా లోకేష్‌ను కోరగా వెంటనే స్పందించిన ఆయన బళ్లు తయారు చేయించి నాయకుల చేతుల మీదుగా శుక్రవారం అందజేయించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, గోవాడ దుర్గారావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కురగంటి మల్లేశ్వరరావు, మహమ్మద్ ఆరిఫ్, వాసిరెడ్డి శ్రీనివాసరావు, ఇజ్జిగాని శంకర్, చిట్టిబొమ్మ రాజశేఖర్, ఇజ్జిగాని భవాని శంకర్, గడ్డం రవి, సికా శివయ్య, కంచర్ల కోటేశ్వరరావు, చేకూరు శివ నాగేశ్వరరావు, షేక్ బాజీ, శృంగారపాటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రంగస్థలానికి పూలవాన

## నేటి నుండే గుంటూరులో భారత్ రంగ్ మహోత్సవం ఒక కళా సంబరం




**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** సాయంత్రం వెలుగులు నెమ్మదిగా వేదికపై పడుతుంటే, నిశ్శబ్దం మాటల కోసం ఎదురుచూస్తుంటే, ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వినిపించే తొలి సంభాషణ... అదే రంగస్థలం జీవితం.
అలాంటి రంగస్థల జీవితానికి గుంటూరు మరోసారి ఆతిథ్యం ఇస్తోంది. శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదికగా శుక్రవారం నుంచి "భారత్ రంగ్ మహోత్సవం" సందర్భంగా "అంతర్జాతీయ నాటక ఉత్సవం" ఆరంభమైంది.పూర్వ గుంటూరు జిల్లా ప్రస్తుతం పల్నాడు జిల్లా ఎడ్లపాడు గ్రామానికి చెందిన యువ వ్యాపార వేత్త కళా తపస్వి, కళా కారుడు డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు నేతృత్వంలో రాష్ట్రం లోని కొన్ని నాటక పరిషత్తులు సమ్మేళనం చేసి "వేదిక" గా నామకరణం చేసి ఎన్ ఎస్ డి (నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా) ఢిల్లీ "వేదిక" సారధ్యం లో దక్షిణ భారత దేశంలో బహుశ ప్రప్రథమం గా గుంటూరు లో నిర్వహిస్తున్న ఈ భారత్ రంగ్ మహోత్సవం కోసం "వేదిక" అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు నేతృత్వంలో, భారీ ఏర్పాట్లు చేశారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా నిర్వహించే అంతర్జాతీయ నాటక ఉత్సవం, భారత్ రంగ్ మహోత్సవ్ 2026. ఈ ఉత్సవం లో పాల్గొనేందుకు గురువారం రాత్రి కే కొన్ని బృందాలు గుంటూరు కు చేరుకున్నాయి. శుక్రవారం సాయంత్రం 3 గంటల కు శుభారంభ సభ తో కళా జాతర ప్రారంభమైంది.అంతర్జాతీయ నాటక ఉత్సవాల సందర్భంగా వెంకటేశ్వర విజ్ఞాన మందిరం, గుంటూరులో మధ్యాహ్నం 3 గంటల నుండి 6 గంటల వరకు జరగనున్న సాంస్కృతిక కార్యక్రమాల వివరాలు...



6 వ తేదీ, శుక్రవారం స్వాగతం డ్యాన్స్ : నారాయణ స్కూల్, యడ్లపాడు. 7 నిమిషాలు శాస్త్రీయ, జానపద నృత్యం గ్రూప్, శాస్త్రీయ సోలో : సెంట్ ఆన్స్, యడ్లపాడు 20 నిమిషాలు శాస్త్రీయ నృత్యం గ్రూప్, సోలో, జానపద నృత్యం: ఐ గ్రోత్, నరసరావుపేట 20 నిమిషాలు కోలాటం, శాస్త్రీయ, జానపద నృత్యం: ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, నరసరావుపేట 45 నిమిషాలు జానపద నృత్యం: ప్రాథమిక పాఠశాల, మాచర్ల 10 నిమిషాలు శాస్త్రీయ, జానపద నృత్యాలు: భాష్యం విద్యా సంస్థలు, గుంటూరు 30 నిమిషాలు శాస్త్రీయ, జానపద నృత్యాలు, కోలాటం ప్రొఫెసర్ ఎం వి ఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ స్కూల్, సుందరయ్య నగర్, గుంటూరు 40 నిమిషాలు ఖచ్చితంగా టైమ్ ప్రకారం కార్యక్రమ నిర్వహణ ఉంటుంది.. రాత్రి 7 గంటల నుంచి మణిపూర్ వారి నాటకం ప్రదర్శన. ఇది కేవలం ఉత్సవం కాదు. అనేక సంస్కృతుల గుండెల్ని ఒక్కటిగా కొట్టించే కళా తాళం. దేశ దిశలన్నింటి నుంచీ, దేశాల సరిహద్దులు దాటి వచ్చిన నాటక బృందాలు ఇక్కడ కలుస్తున్నాయి. మాటలు మారినా భావం మారదు అన్నట్లుగా, భాషల్ని దాటుకుని మానవ అనుభూతులు వేదికపై నిలబడనున్నాయి. ఒక్కో నాటకం ఒక కథ కాదుడ ఒక జీవితం. ఒక్కో పాత్ర ఒక వ్యక్తి కాదు.ఒక కాలం. భారత్ రంగ్ మహోత్సవం వేదికపై సంప్రదాయం అడుగులేసుకుంటూ నడుస్తుంటే, ఆధునికత ఆ అడుగులతో కలిసి నర్తిస్తుంది. ఒకే వేదికపై కలసి కళకు కొత్త రూపాన్ని ఇస్తున్నాయి. ప్రేక్షకుడు కేవలం వీక్షకుడు కాదు అతడూ ఆ నాటకంలో ఒక భాగమే. ఈ ఉత్సవం కళాకారుల పట్ల ప్రేమతోనే కాక, బాధ్యతతోనూ నిండింది. ప్రతి రోజు కళాకారులు మరియు ప్రేక్షకులకు విందు భోజన సదుపాయం కల్పించడం కేవలం ఆతిథ్యం కాదుడ కళకు ఇచ్చే గౌరవం. దూర ప్రాంతాల నుంచి వచ్చే బృందాలకు ముందుగానే సమాచారం అందితే వసతి, భోజన సదుపాయాలను సవ్యంగా ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు సిద్ధంగా ఉండడం ఈ ఉత్సవానికి ఉన్న మానవీయ స్పర్శను తెలియజేస్తుంది. ఈ రోజుల్లో శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఒక భవనం మాత్రమే కాదు అది ఒక కలల గూడు. అక్కడ ప్రతిధ్వనించే ప్రతి అడుగు ఒక రిహార్సల్. వెలుగుల మధ్య తిరిగే ప్రతి నీడ ఒక పాత్ర. తెర వెనుక వినిపించే ప్రతి శ్వాస ఒక కథగా మారేందుకు సిద్ధంగా ఉంది. భారత్ రంగ్ మహోత్సవం గుంటూరును కేవలం ఒక నగరంగా కాదు ఒక సాంస్కృతిక అనుభూతిగా మారుస్తోంది. యువతకు ఇది ఒక పాఠం. కళాకారులకు ఇది ఒక ఆశ్రయం. ప్రేక్షకులకు ఇది ఒక అంతర్ముఖ ప్రయాణం. నాటకం ముగిసిన తర్వాత కూడా ఆలోచనలు కొనసాగితే, కన్నుల్లో తడి మిగిలితే, హృదయం కదిలితే అదే నిజమైన రంగస్థలం. నాటకం ముగిసినా జీవితం కొనసాగుతుంది.మంచి నాటకం మాత్రం మనలోనే మిగిలిపోతుంది. అలాంటి నాటకాలు మన గుంటూరులో భారత్ రంగ్ మహోత్సవంగా, ఒక కళా పర్వంగా కన్నుల విందు చేయనుంది.



## ఉద్యోగుల బకాయిల చెల్లింపు విషయములో జాప్యం తగదు

- ఆర్థిక సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి
- పలనాడు జిల్లా అధ్యక్షులు స్వర్ణ చినరామిరెడ్డి

**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** ప్రభుత్వం ఇప్పటికే ఉద్యోగులకు బకాయిలు చెల్లింపు విషయంలో జాప్యం చేస్తుందని, ఆ బకాయిలు వేల కోట్ల రూపాయలకు చేరాయని ఆర్థిక సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు స్వర్ణ చినరామిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ కలిసి సమస్యల పరిష్కారానికి ఈ మేరకు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెండింగు డి.ఏలు, పి.ఆర్.సి ఏర్పాటు,మధ్యంతర భృతిపై విడుదలపై ఇప్పటికి స్పష్టమైనటువంటి ఆదేశాలు ప్రభుత్వం నుంచి రాలేదన్నారు. ఉద్యోగ సంఘం ఇచ్చిన విజ్ఞాపత్రం లోని అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, కన్నా లక్ష్మీ నారాయణ కి ఉన్న సుదీర్ఘ పరిపాలన అనుభవంతో ఈ ఉద్యోగుల ఆర్థిక సమస్యలపై పరిష్కారం చూపించాలని రామిరెడ్డి అన్నారు. తాము అందజేసిన విజ్ఞాపన పత్రాన్ని ప్రభుత్వం దృష్టికి తీసు కెళతానని కన్నా హామీ ఇచ్చారన్నారు.సంఘ కార్యదర్శి చుక్క వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని ఉద్యోగుల యొక్క సమస్యలకు పరిష్కారం చూపించాలని 2026- 27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో ఉద్యోగుల ప్రయోజనాలకు ఆర్థిక కేటాయింపులు చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ సంఘం 175 మంది శాసనసభ్యులు 58 మంది శాసనమండలి సభ్యులు అందరికీ కూడా విజ్ఞాపన పత్రాన్ని అందజేసి ప్రభుత్వానికి ఉద్యోగుల సమస్యలపట్ల నిర్ణయం తీసుకునే విధంగా చర్యలు సంఘ రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ చేపట్టారని సత్తెనపల్లి తాలూకా అధ్యక్షులు బి. సంపత్ కుమార్ వివరించారు. కన్నా ఉద్యోగుల పట్ల సుహృద్భా వంతో స్పందించటం పట్ల జాయింట్ సెక్రెటరీ సంగీత ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీజిఇఏ సత్తెనపల్లి తాలూకా అధ్యక్షులు బి సంపత్ కుమార్, సంఘ ప్రతినిధులు రోశయ్య, చంద్రశేఖర్, కోటేశ్వరరావు, రాజేష్, సురేష్, జీవన్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## అక్షరాస్యతతోనే అభివృద్ధి : ఎంపీడీవో పి రత్నం



**ముప్పాళ్ల మేజర్ న్యూస్ :** ప్రతి మహిళా తప్పనిసరిగా చదువుకొని ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధించాలని ఎంపీడీవో పి రత్నం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చాగంటి వారి పాలెం అంగన్వాడీ కేంద్రంలో అక్షరాంధ్ర కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ కొండలరావు, ఫీల్డ్ ఆఫీసర్ వెంకట గణేష్ లు పాల్గొని కేంద్ర ప్రభుత్వం తక్కువ మొత్తంతో అత్యధిక ప్రయోజనాలు కలిగిన అనేక భీమా, ఇతర పొదుపు, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన, ఇతర పథకాల గురించి అవగాహన కల్పించారు. బ్యాంకు సిబ్బంది హరి, ఐకెపిసిసి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అక్షర ఆంధ్ర అభ్యాసకులను యాప్ లో అప్ డేట్ చేయాలి

## - జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** అక్షర ఆంధ్ర అభ్యాసకులను యాప్ లో అప్ డేట్ చేయాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. అక్షర ఆంధ్ర కార్యక్రమంపై కలెక్టర్ కార్యాలయం నుండి శుక్రవారం వర్చువల్ సమావేశం నిర్వహించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నాటికి యాప్ లో నమోదు పూర్తి కావాలని స్పష్టం చేశారు. తాడేపల్లి, పెదనందిపాడు, గుంటూరు పట్టణం, తెనాలి తదితర మండలాల్లో నమోదు తక్కువగా ఉందని అన్నారు. జిల్లాను అక్షరాస్యతలో అగ్రగామిగా నిలపాలని పిలుపునిచ్చారు. ఉల్లాస్ కార్యక్రమాన్ని బాగా అమలు చేసి ప్రతి ఒక్కరిలోనూ అక్షర జ్ఞానం నింపడమే కాకుండా వారికి నిర్వహించే పరీక్షలలో ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని అన్నారు. జిల్లాలో నిరక్షరాస్య లను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తు న్న ఉల్లాస్ - అక్షర ఆంధ్ర కార్యక్రమం నిర్దేశిత లక్ష్యాలను అందుకొనుటకు అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలో నిరక్షరాస్యులను గుర్తించడం జరిగిందని, అక్షరాస్యత కేంద్రాలు ఏర్పాటు చేసి వాలంటీర్లతో ఉల్లాస్ ద్వారా అక్టోబరు నుంచి తరగ తులను ప్రారంభించడం జరిగిందని, వంద గంటలు జరిగే ఈ శిక్షణ కార్యక్రమం మార్చి వరకు కొనసాగుతుం దని, పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉల్లాస్ అక్షర ఆంధ్ర శిక్షణ కార్యక్రమాలను ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పటిష్టంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. శిక్షణ కాలం ముగిసే నాటికి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిర్దేశించిన లక్ష్యాల మేరకు నిరక్షరాస్యులందరూ ప్రాథమికంగా అక్షరాలు, అంకెలు, చదవటం, వ్రాయటం నేర్చుకోవడమే కాకుండా డిజిటల్ మరియు ఆర్థిక అక్షరాస్యతను తెలియజేసే విధంగా చర్యలు తీసుకోవా లన్నారు. రాష్ట్రంలో శత శాతం అక్షరాస్యత సాధించాలని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి ఆశయమని, అందుకు అనుగుణంగా ప్రాధాన్యతతో పనిచేయాలని అన్నారు. ఫిబ్రవరి 28వ తేదీన ప్రీ ఫైనల్ పరీక్షలు, మార్చి 29వ తేదీన ఫైనల్ పరీక్షలు జరుగుతా యని చెప్పారు. ఇచ్చిన వర్క్ షీట్ లు, వీడియోలు వారికి చూపించడం, అభ్యసన స్థాయిలను మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

### యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే వేగవంతం చేయాలి

యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అన్ని మండలాల్లో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు వ్యక్తిగత పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. హడావిడిగా సర్వే చేసి తప్పులకు ఆస్కారం ఇవ్వరాదని స్పష్టం చేశారు. నాణ్యత ప్రధానమని అన్నారు. ఈ సమావేశంలో వయోజన విద్యా డిప్యూటీ డైరక్టర్ ఆంజనేయులు, జిల్లా విద్యా శాఖ అధికారి డా. షేక్ సలీం భాషా, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు లోచర్ల రమేష్, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె రామ అప్పల నాయుడు, మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ హేమ మాలిని తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్ మహోత్సవ్ వేదికపై "చైనా పీస్" సినిమా యూనిట్ సందడి



**గుంటూరు మేజర్ న్యూస్ :** చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జరుగుతున్న జాతీయస్థాయి 19వ ఎడిషన్ "విజ్ఞాన్ మహోత్సవ్ 2కే26" రెండో రోజు కార్యక్రమాలు మరింత ఉత్సాహంగా సాగాయి. ఇప్పటికే క్రీడా పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలతో కళకళలాడుతున్న మహోత్సవ్ వేదికపై "చైనా పీస్" సినిమా యూనిట్ సందడి చేయడంతో విద్యార్థుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా హీరో నిహాల్ కొదాటి, నటి శిరీష, దర్శకుడు అక్కి విశ్వనాథ రెడ్డి ఈ మహోత్సవానికి హాజరై విద్యార్థులతో కలిసి స్టెప్పులు వేసి వేదికను ఉర్రూతలూగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హీరో నిహాల్ కొదాటి మాట్లాడుతూ "చైనా పీస్" సినిమా మార్చి 6న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే దేశభక్తి థీమ్‌తో విడుదలైన "భగ భగ" పాటకు మంచి స్పందన వస్తోందని, అలాగే "ఇదేంటో జేమ్స్ బాండ్" పాట కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిందన్నారు. ఈ సందర్భంగా నటి శిరీష మాట్లాడుతూ, "చైనా పీస్" సినిమాలో తన పాత్ర కథలో కీలక మలుపులు తిప్పే విధంగా ఉంటుందని, ప్రేక్షకులను ఆకట్టుకునే బలమైన పాత్రగా ఇది నిలుస్తుందని తెలిపారు. దర్శకుడు అక్కి విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ, "చైనా పీస్" మూవీ క్లాసిక్ స్పై డ్రామాతో పాటు థ్రిల్, యాక్షన్, హ్యూమర్ అన్నీ మేళవింపుతో రూపొందించామని చెప్పారు. ఈ చిత్రాన్ని మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై నిర్మించారని, సినిమాకు అక్కి విశ్వనాథ రెడ్డి దర్శకత్వం వహించగా, సంగీత దర్శకుడిగా ఆర్. కార్తీక్, ఎడిటర్‌గా మార్తాండ్ కే. వెంకటేష్, సినిమాటోగ్రాఫర్ (డీవోపీ)గా ఆర్. సురేష్ పనిచేశారని తెలిపారు. ఇప్పటికే క్రీడా పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఉత్సాహంగా సాగుతున్న విజ్ఞాన్ మహోత్సవ్‌కు సినిమా బృందం చేసిన ఈ సందడి మరింత రంగు అద్దింది. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అదృశ్యమైన వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి



**తెనాలి, మేజర్ న్యూస్ :** అదృశ్యమైన వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె మృతదేహం రూరల్ పరిధిలోని కంచర్లపాలెం గ్రామం సమీపంలోని కాలువలో శుక్రవారం కనిపించింది. తెనాలి రూరల్ గ్రామం నందివెలుగు కు చెందిన 70 ఏళ్ళ మాణిక్యమ్మ ఈనెల మూడున పట్టణంలోని మెయిన్ రోడ్డులో గల సాయిబాబా గుడి వద్ద తప్పిపోయిన సంగతి తెలిసిందే. ఆమె మందులు కొనుగోలు నిమిత్తం ఈనెల మూడున తెనాలి వచ్చింది. తిరిగి నందివెలుగు వెళ్ళేందుకు స్టేషన్ రోడ్డులో ఆటో కోసం వేచి ఉండి అదృశ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో కంచర్లపాలెం సమీపంలో కాలువలో మహిళ మృత దేహం ఉన్నట్లు శుక్రవారం సమాచారం అందింది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కాగా మహిళ ఒంటిపై ఉన్న నగలు కాజేసేందుకు ఎవరైనా హతమార్చి ఉంటారా, లేదా మృతికి ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వృద్ధులకు ఉచిత ఆరోగ్య శిబిరం



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** జాతీయ వయోవృద్ధుల ఆరోగ్య సంరక్షణ క్రమంలో భాగంగా పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామంలోని వృద్ధాశ్రమంలో డాక్టర్ కె.వి ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఆరోగ్య స్పెషలిస్ట్ డాక్టర్స్ ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించడం జరిగింది. 63 మందికి పైగా వృద్ధులకు కంటి పరీక్షలు, దంతాలకు సంబంధించి ఇబ్బందులు, స్త్రీలకు సంబంధించిన సమస్యలకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు డాక్టర్ కె అలేఖ్య జనరల్ మెడిసిన్, డాక్టర్ ఆశాపూర్ణిమ గైనకాలజిస్ట్, డాక్టర్ పవిత్ర, డాక్టర్ ఎన్ హేమశ్రీ, డాక్టర్ షేక్ రేష్మ సివిల్ సర్జన్ డెంటల్, డాక్టర్ జె మాధురి ఈ యన్ టి స్పెషలిస్ట్, డాక్టర్ రాజేశ్వరి యన్ సి డి ప్రోగ్రాం ఆఫీసర్ పల్నాడు, తుమ్మలచెరువు సిహెచ్ఓ , ఏఎన్ఎం లు, ఆశాలు పాల్గొన్నారు.

# ఎంపీపీ అంజమ్మను సన్మానించిన ఎమ్మెల్యే యరపతినేని



**మాచవరం, మేజర్ న్యూస్:** మాచవరం ఎంపీపీ ఒక్కర అంజమ్మ ను గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ మాచవరం ఎంపీపీ బీసీ మహిళ కొక్కెర అంజమ్మ కు దక్కటం ఆనందంగా ఉందన్నారు. టిడిపికి కుటుంబంగా, కష్టపడ్డ కార్యకర్తలుగా ఉన్న కుటుంబంలో వారిని పదవి హరిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గురజాల నియోజకవర్గ టిడిపి పరిశీలకులు కల్లం రాజశేఖర్ రెడ్డి, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, మాచవరం తాసిల్దార్ ఎం నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో విష్ణు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి సంక్షేమానికి కృషి చేస్తా

## - పద్మశాలి సంఘ అధ్యక్షులు గుత్తి కొండ ధనుంజయరావు



**మంగళగిరి, మేజర్ న్యూస్:** పద్మశాలీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహుత్తమ సంఘం నూతన అధ్యక్షులు గుత్తికొండ ధనుంజయరావు అన్నారు. మంగళగిరి పట్టణ పద్మశాలి బహుత్తమ సంఘం అధ్యక్షులుగా ఈనెల 1వ తేదీ ఆదివారం జనరల్ బాడీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైన గుత్తికొండ ధనుంజయరావు ది6-2-2026 శుక్రవారం ఉదయం 8:30 గంటలకు మంగళగిరి నాంచారమ్మ ప్రాంగణంలోని శ్రీ బద్రావతి సమేత భావనారుషీ స్వామి వార్ల దేవాలయంలో సంఘ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా సంఘ పెద్దలతో కలిసి కులదైవమైన శ్రీ భద్రావతి సమేత భావనా ఋషి స్వామివార్ల కు పూజలు నిర్వహించారు అనంతరం అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించారు. సంఘం అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన గుత్తికొండ ధనుంజయరావును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు చింతకింది కనకయ్య, ప్రధాన కార్యదర్శి దామర్ల కుబేర స్వామి, కోశాధికారి గంజి రవీంద్రనాథ్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ కందుల నాగార్జున, పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ మంగళగిరి బ్రాంచ్ అధ్యక్షులు తాటిపాముల లక్ష్మీ పెరుమాళ్ళు,సహాయ కార్యదర్శి మునగపాటి వెంకటేశ్వరరావు, వీటి జయం అండ్ ఐ వి టి ఆర్ డిగ్రీ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దామర్ల వెంకట నరసింహం, రామనాథం పూర్ణచంద్రరావు,వంగర లక్ష్మయ్య ,జొన్నాదుల బిక్ష రావ్, వంగర లక్ష్మయ్య, కొల్లి ప్రసాద్, కొల్లి పూర్ణ, కౌతరపు శ్రీను, తేడా త్రిమూర్తులు, జొన్నాదుల బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# భూ కబ్జా కు యత్నించిన ఇరువురు జనసేన నేతలు

## - తమకు న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబం వేడుకోలు

## - డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ కు విజ్ఞప్తి

**మంగళగిరి, మేజర్ న్యూస్:** మంగళగిరి కి చెందిన ఇరువురు జనసేన పార్టీ నాయకులు నకిలీ పత్రాలతో తమ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఓ బాధిత కుటుంబం వేడుకొంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... నగరంలోని లక్ష్మీనరసింహస్వామి కాలనీకి చెందిన కదిరి ఏసుపాదం, కదిరి ఏసోబు, ప్రసాదరావు, సుధీర్ లకు గత మూడు దశాబ్దాల క్రితం ఆనాటి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. దీంతో వారంతా గృహాలు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. గడచిన కొన్నేళ్ల క్రితం తుఫాన్ల కారణంగా నివాస గృహాలు పడిపోయాయి. అప్పటినుంచి నివాస గృహ స్థలాలు ఖాళీగా ఉండడంతో కంప చెట్లు పెరిగాయి. నివాస గృహస్థలాల్లో పెరిగిన కంప చెట్లను తొలగించాలని నగరపాలక సంస్థ అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. దీంతో స్థలాల్లోని కంప చెట్లను శుభ్రం చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో జనసేన పార్టీకి చెందిన కొదమల కుమార్ అక్కడికి చేరుకొని ఈ స్థలాల్లో తమకు చెందిన ఒక ప్లాటు ఉందని, ఆ స్థలం తనకు అప్పగించకుంటే గతంలో తాను చేసిన ఫిర్యాదులను మళ్లీ చేసి ఇల్లు వేసుకోకుండా చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఆయనకు మద్దతుగా మరో జనసేన నాయకుడు అవినాష్ వచ్చి సచివాలయ సిబ్బందిని బెదిరించి మంత్రి నారా లోకేష్ ఇచ్చే క్రమబద్ధీకరణ పట్టా రసీదు ఇవ్వవద్దని సూచించాడు. కావున తమ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన విషయంపై విచారించి న్యాయం చేయాలని బాధ్యత కుటుంబం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, మంత్రి నారా లోకేష్ కు విజ్ఞప్తి చేశారు.


ఎన్.లక్ష్మినారాయణ, రీజనల్ మేనేజర్, ఫోన్ నెం. 63011 07116

## కాజ వెంకటసుబ్రహ్మణ్యంకు విశ్వనాథ సాహిత్య అకాడమి జీవన సాఫల్య పురస్కారం



**పెదకాకాని మేజర్ న్యూస్ :** విశ్వనాథ సాహిత్య అకాడమి దశమ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ కూచిపూడి నాట్య గురువు, సాయిమంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకులు డా॥ కాజ వెంకట సుబ్రహ్మణ్యంకు విశ్వనాథ సాహిత్య అకాడమి జీవన సాఫల్య పురస్కారంను అందించారు. ఈ వేడుకను వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటి నందు నిర్వహించారు. ఈకార్యక్రమానికి వివిఐటియు ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్. విశ్వనాథ సాహిత్య అకాడమి చైర్మన్ డా॥ మద్దినేని సింహకౌటిల్య చౌదరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సింహకౌటిల్య చౌదరి మాట్లడుతూ సుధీర్ఘకాలంగా కూచిపూడి నాట్యానికి విశేషమైన సేవలు అందించినందుకు గాను ఈ పురస్కారం అందించటం జరిగిందని తెలిపారు. దేశ విదేశాలలో 60 మంది వెంకటసుబ్రహ్మణ్యం వద్ద శిక్షణను అభ్యసించిన వారు నాట్య గురువులగా కూచిపూడి నాట్యానికి సేవలు అందిస్తున్నారనీ, రుక్మిణీ కళ్యాణం, గోదా కళ్యాణం వంటి 20కి పైగా నృత్యనాటికలను ఆయన రచించారనీ పేర్కొన్నారు. 350 యేళ్లనాటి తంజావూరి విజయ రాఘవ నాయకుడు రచించిన విప్రనారాయణ చరిత్రము యక్షగానానికి, త్యాగరాజ స్వామి 250 ఏళ్ల క్రితం రచించిన ప్రహ్లాద భక్తి విజయం, నౌకాచరితము యక్షగానాలకి సుబ్రహ్మణ్యం చేసిన నృత్యరూపకల్పన అత్యద్భుతం అని కొనియాడారు. అనంతరం కాజ వెంకట సుబ్రహ్మణ్యం దంపతులను వివిఐటియూ ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ సత్కరించారు. సభానంతరం కేంద్ర సంగీత నాటక అకాడమి ఆవార్డు గ్రహీత డా॥ వేదాంతం రామలింగ శాస్త్రి బృందం ప్రదర్శించిన కూడిపూడి నృత్యనాటకం భక్తప్రహ్లాద ప్రేక్షకులను అలరించింది. ఈ కార్యక్రమంలో విశ్వనాథ సాహిత్య ఆకాడమి కార్యదర్శి మోదుగుల రవికృష్ణ. సభ్యులు పి.సత్యన్నారాయణ రాజు, భూసురుపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్ఫూర్తిని నింపిన టెడ్-ఎక్స్ వివిఐటియు




**పెదకాకాని మేజర్ న్యూస్ :** వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటి నందు నిర్వహించిన “టెడ్ఎక్స్ -వివిఐటియు “ విద్యార్థులలో స్ఫూర్తినినింపి, ప్రేరణ కలిగించే విధంగా సాగింది. ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న అంశాలపై ప్రతిభావంతుల ఆలోచనల వ్యాప్తి కొరకు ఏర్పాటు చేయబడ్డ టెడ్- ఎక్స్ కార్యక్రమంలో, సవాళ్లు ఎదురైనప్పుడు వాటిని అధిగమించి ఏవిధంగా ముందుకు సాగాలో విద్యార్థులకు తెలియజేస్తూ వక్తలు ప్రసంగించారు. విద్య, విజ్ఞానం, కళ, మానసిక ఆరోగ్యం, సామాజిక మార్పు వంటి అంశాలపై ఆలోచనలను పంచుకుంటూ ప్రపంచ ప్రఖ్యాత 9మంది వక్తలు వారి జీవితానుభవాలను తెలిపి, వారు అధిగమించన సవాళ్లను విద్యార్థులకు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా పలు అంశాలపై అవగాహన కలిగించి క్లిష్టసమయాలలో సరైన మార్గాలు ఎన్నుకునే విధంగా విద్యార్థులలో ప్రేరణ కలిగించేందుకు కార్యక్రమం దోహదపడుతుందని వివిఐటి ప్రొ - ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ అన్నారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత ఆర్కిటెక్ట్ గోపాల్ శంకర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు (అంతర్జాతీయ నైపుణ్యం మరియు మొబిలిటీ) సీతాశర్మా, టాలీవుడ్ నటుడు మరియు చెఫ్ జీవన్ కుమార్, డిఆర్డిఓ పరిశోధకురాలు స్వప్నా ఎమ్. ఉమెన్ ఫెలోషిప్ ప్రోత్సాహకురాలు సలోని జైన్, సోషల్ మీడియా క్యాంపేయనర్ దేదీప్య అబ్బగాని, మానవ వనరుల నిపుణుడు రంగనాథ్ గంధం, వివిఐటి విద్యార్థులు సెరీనా జొసెఫిన్, సౌమ్యశ్రీ నూకల విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

# డ్రగ్స్‌కు నో చెప్పి భవిష్యత్తును కాపాడుకుందాం

## దుర్గిలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం




**దుర్గి మేజర్ న్యూస్ :** దుర్గి మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ సూరె వెంకటేశ్వర్లు అధ్యక్షతన కార్యక్రమం కొనసాగింది. ఈ సమావేశానికి హాజరైన కారంపూడి సర్కిల్ సి.ఐ. శరత్‌బాబు మాట్లాడుతూ, డ్రగ్స్ వినియోగం యువత జీవితాలను ఎలా నాశనం చేస్తుందో విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ అలవాటు వ్యక్తి ఆరోగ్యానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. డ్రగ్స్‌ను సమాజం నుంచి పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణ కోసం కూటమి ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రత్యేక ఈగిల్ టీమ్‌ల ద్వారా పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన అక్రమ కార్యకలాపాల్లో పాల్గొన్న వారిని డ్రోన్ కెమెరాలు వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ తయారీ, సరఫరా చేసే వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అదే సమయంలో డ్రగ్స్‌కు బానిసైన వారికి కౌన్సిలింగ్ సెంటర్ల ద్వారా మార్పు తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ యం.రెహమాన్ మాట్లాడుతూ, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని సూచనలు చేశారు. సమాజంలో ఎక్కడైనా డ్రగ్స్‌కు సంబంధించిన కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా సి.ఐ. శరత్‌బాబును స్కూల్ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. అనంతరం విద్యార్థులు స్కూల్ నుంచి ముటుకూరు రోడ్డు సెంటర్ వరకు నినాదాలు చేస్తూ డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. రోడ్డు సెంటర్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని స్కూల్ చైర్మన్ వెంకటేశ్వర్లు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.బాలస్వామి, ఎన్.వి.శివయ్య, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పి.హెచ్.సిలలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

## - జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, రోగులతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించేలా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై పబ్లిక్ పెర్సెప్షన్, ఎంసీహెచ్ సేవల నమోదు, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్యక్రమాలపై యుపీహెచ్సీ, పీహెచ్సీల వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో పబ్లిక్ పెర్సెప్షన్ లో పాజిటివ్ ఫీడ్ బ్యాక్ మరింతగా మెరుగుపర్చాలన్నారు. ప్రజలకు అవసరమైన మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. యుపీహెచ్సీ, పీహెచ్సీల పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా ప్రోగ్రాం ఆఫీసర్, ప్రత్యేక అధికారులను నియమించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలో హై రిస్క్ బాలింతల ఆరోగ్యం పర్యవేక్షించటంలో నిర్లక్ష్యం వహించే వైద్య సిబ్బంది పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎఎన్ఎం లతో నిరంతరం సమావేశాలు నిర్వహించి వైద్య సేవలపై సమీక్షలు నిర్వహించి మినిట్స్ ను జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయాలకు వైద్యాధికారులు సమర్పించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెలివరీ ల సంఖ్య పెంచాలన్నారు. మాతృత్వం మరణాలు తగ్గించేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. విజయలక్ష్మి, డీపీఎంఓ డా.సుజాత, డిఐఓ డా. శ్రావణ్ కుమార్, డిప్యూటీ డి.ఎం. హెచ్ఓ డా.అన్నపూర్ణ, ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డా.విజయ్ ప్రకాశ్, ఎస్ఓ పద్మజ. డీపీఓ సైమన్ రాజు, డీపిహెచ్ఎన్ఓ డా. ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# మార్నింగ్ వాక్ మహిళలు జర జాగ్రత్త : యస్ ఐ శివ నాగరాజు




**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** ఇటీవల పిడుగురాళ్ల పరిధిలో వరుస దొంగతనాలతో మహిళలు బాంబేలు ఎత్తుతున్నారు. ఉదయం,సాయంత్రం వేళ వాకింగ్ చేస్తున్న మహిళ కళ్ళలో కారం చల్లి మెడలో బంగారు గొలుసు దోచుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల మహిళలు ప్రతిఘుడిచడంతో సగం చైన్ లాక్కు పోవడం కలకలం రేపింది. ఈ ఘటన మరువక ముందే....ఆంధ్రబ్యాంక్ ఎదురు రోడ్డులో నిన్న సాయంత్రం.. నడుస్తున్న మహిళ చేతిలో సెల్ ఫోన్, మెడలో గోల్డ్ లాక్కునేందుకు ప్రయత్నం చేయడంతో...అక్కడ ఉన్న వారు దొంగ దొంగా అని కేకలు వేయటంతో పారిపోయాడు. ఇలాంటి సంఘటనల పై మహిళలు, ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు. పోలీసులు గస్తీ ఏర్పాటు చేయాలని మహిళలు, పురుషులు కోరుతున్నారు. నిందితులను వెంటనే పట్టుకొని బాధితులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఘటనలపై పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ శివ నాగరాజు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో బంగారం విలువ పెరగటంతో చైన్ స్నాచర్స్ హెల్మెట్ ధరించి టూ వీలర్ పై దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. మార్నింగ్ వాక్ కి వెళ్లే మహిళలు విలువైన ఆభరణాలు సెల్ ఫోన్ తో వెళ్లకుండా ఉండటమే మంచిదన్నారు. సురక్షిత ప్రాంతాలలో మాత్రమే వాక్ చేయాలని, శివారు ప్రాంతాలలో మార్నింగ్ వాక్ కు మంచిది కాదని, సురక్షితమైనది కూడా కాదని, తగిన జాగ్రత్తలు తీసుకొని మార్నింగ్ వాక్ కు వెళ్లాలని పట్టణంలోని హై స్కూల్, పోలీస్ గ్రౌండ్ వంటి సురక్షితమైన ప్రాంతాలలో మార్నింగ్ వాక్ చేసుకోవచ్చని సూచించారు.



## తమ నివాస ప్రాంతాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్నా, వారి నుండి రక్షణ కల్పించండి

### – జిల్లా కలెక్టర్ ను వేడుకున్న చౌడవరం చెక్క తండావాసులు



**గుంటూరు మేజర్ న్యూస్ :** గత 15 సంవత్సరాలుగా ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న తమ నివాసాలను ఆక్రమించుకోవాలన్న దురుద్దేశంతో కొంతమంది తమపై నిత్యం దాడులకు పాల్పడుతూ తమను వేధింపులకు గురి చేస్తున్నారని చౌడవరం గ్రామం చౌడవరం చెక్క ప్రాంతానికి చెందిన సుగాలి కుటుంబాలు శుక్రవారం జిల్లా కలెక్టర్ ను ఆశ్రయించారు. వివరాలలోకి వెళితే చౌడవరం చెక్క ప్రాంతానికి చెందిన సుమారు ముప్పై సుగాలి కుటుంబాలు గత పదిహేను సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని, గత పది సంవత్సరాలకు పైగా ఇంటిపన్ను, నీటిపన్ను, కరెంటు బిల్లులను చెల్లిస్తున్నామని, కానీ కొంతమంది తమ నివాసాలను ఆక్రమించుకోవాలన్న దురుద్దేశంతో తమపై నిత్యం దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వారు చేసిన దాడులలో ప్రాణ నష్టం సైతం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. తాము పనులకు వెళితే తమ ఇళ్లు కూలుస్తారన్న భయంతో పనులకు వెళ్లకుండా ఇళ్ల వద్దనే ఉండడంతో కనీసం తినడానికి తిండిలేక బాధలపాలవుతున్నామని వాపోయారు. గతంలో ప్రభుత్వం తాము నివాసం ఉంటున్న భూమిని అసైన్డ్ భూమిగా గుర్తించిందని, తాము గతంలో ఇళ్ల పట్టాలకోసం అర్జీలను సైతం పెట్టుకున్నామని వారు గుర్తు చేశారు. తమను సదరు ఆక్రమణ దారుల బారి నుండి కాపాడి తాము నివాసం ఉంటున్న ఇళ్ల స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ను కలసి తమ గోడును విన్నవించుకున్నట్లు మీడియాకు వెల్లడించారు.

## కెఎల్ యులో డిజైన్ థింకింగ్ పై వర్క్ షాప్



**మంగళగిరి మేజర్ న్యూస్ :** వడ్డేశ్వరం కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో శుక్రవారం నాడు అకడమిక్ స్టాఫ్ కాలేజ్, ఐక్యు ఎసి, మల్టీడిసిప్లినరీ ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విభాగాల సంయుక్త అధ్వర్యంలో డిజైన్ థింకింగ్ ద్వారా మీ జీవితాన్ని రూపొందించుకోండి అనే అంశం పైన ఒక రోజు కార్యశాలను నిర్వహించారు. ఈ సదస్సుకు విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ డాక్టర్ అనిల్ కపూర్, ఎవిఎస్ ఎం, విఎస్ ఎం, ఐఐటి తిరుపతి ప్రాక్టీస్ ప్రొఫెసర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధి కోసం డిజైన్ ఆలోచన యొక్క అనువర్తనంపై అంతర్దృష్టి, ఇంటరాక్టివ్ సెషన్‌ను అందించారు. భవిష్యత్ నిపుణుల కోసం సృజనాత్మకత, ఆవిష్కరణ, స్పష్టమైన సమస్య పరిష్కార నైపుణ్యాల ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. పాల్గొనే వారిని డిజైన్ ఆలోచనను జీవిత నైపుణ్యంగా స్వీకరించమని ప్రోత్సహించారు. విద్యా, వృత్తిపరమైన, వ్యక్తిగత సందర్భాలలో నిర్ణయం తీసుకోవడంలో, నాయకత్వంలో దాని ఔచిత్యాన్ని హైలైట్ చేశారు. ఈ సందర్భంగా అకడమిక్ స్టాఫ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాధికా రాణి చింతల ప్రసంగిస్తూ డిజైన్ థింకింగ్ అనేది వ్యాపార ఆవిష్కరణలకు అతీతంగా శక్తివంతమైన మనస్తత్వం అని, భవిష్యత్తులో సిద్ధంగా ఉన్న నిపుణులను సిద్ధం చేయడానికి బోధన, మార్గదర్శకత్వం, నాయకత్వ పద్ధతులను పునరాలోచించడానికి విద్యావేత్తలకు వీలు కల్పిస్తుందని అన్నారు. సృజనాత్మకత, సమస్య పరిష్కారం మరియు వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి విభాగం చురుకుగా నిర్వహిస్తున్న డిజైన్ థింకింగ్ మరియు ఇన్నోవేషన్ కార్యకలాపాలను ఎండి అండ్ ఐఇ విభాగాధిపతి డాక్టర్ కె. నరసింహ రాజు హైలైట్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి. పార్ధ సారధి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్ రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, అకడమిక్ స్టాఫ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాధికా రాణి చింతల హెడ్ డాక్టర్ కె. నరసింహ రాజు, ఈవెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ దిప్లేష్ గౌతమ్, ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉండవల్లిలో కుంభకోణం కాఫీ షాపు ప్రారంభం



**మంగళగిరి మేజర్ న్యూస్ :** మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి ఉండవల్లి దేవుడు మాన్యం వద్ద జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు జొన్న రాజేష్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కుంభకోణం కాఫీ షాపును శుక్రవారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో కుంభకోణం కాఫీ షాపు ఏర్పాటు ఇదే తొలిసారి అని తెలిపారు. షాపు నిర్వాహణలో నాణ్యతా, ప్రమాణాలను పాటించాలని ఈ సందర్భంగా చిల్లపల్లి సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు మంగళగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, ఏంటీఎంసీ అధ్యక్షులు మునగపాటి మారుతి, శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ట్రస్ట్ బోర్డ్ సభ్యులు బళ్ల ఉమామహేశ్వరరావు, ఉండవల్లి గ్రామ మాజీ సర్పంచ్ జొన్న శివశంకర్, బడే సాంబశివరావు, సాధు చంద్రశేఖర్, అంబటి తిరుపతిరావు, చాముండేశ్వరి దేవి, జనసేన పార్టీ ఉండవల్లి గ్రామ అధ్యక్షులు రాజా రమేష్, వీరిశెట్టి వెంకటేశ్వరరావు, దినేష్ చక్రవర్తి, తెలుగుదేశం పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు దాసరి కృష్ణ, టిడిపి ఉండవల్లి గ్రామ అధ్యక్షులు నరేంద్ర, నాయకుల తోట సాంబశివరావు, బసివి రెడ్డి, లింగం శెట్టి కిషోర్, జంగాల సాంబశివరావు రోటరీ క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.